**నేటి కందం- నేటికి అందం**

వేగిరముగ వృద్ధిని గొని
తేగల పాటవము భారతీయుల దనుచున్
రేగిన మన సామర్థ్యము
దాగనిదని శక్తికాంత దాసు వచించెన్ !!

(ప్రపంచమంతా యుద్ధాలతో అల్లాడుతున్న వేళ భారత దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధాన కార్యదర్శి ఆర్థిక నిపుణుడు మాజీ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత్ దాస్ అన్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

యుగానికి శాంతి
యుద్ధానికి నిషేధమె
విస్మరిస్తే శ్మశానం
విశ్వానికి విషాదమె
అగ్గిని కనుగొన్న మనిషి
అతడే బుగ్గి అనుకోలే
ప్రగతి తిరగబడుతుందని
ప్రతి ఒక్కటి కనుగోలే

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 11-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:189 పేజీలు:6 వెల: రూ.1/-


## రాష్ట్రపతికి రాజీనామా పంపిన జస్టిస్ యశ్వంత్ వర్మ

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10:జస్టిస్ యశ్వంత్ వర్మరాజీనామా చేశారు. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టులో ఆయన జడ్జీగా ఉన్నారు. అవినీతి ఆరోపణ కేసులో ఆయనపై అభిశంసన ప్రక్రియ జరుగుతున్న విషయం తెలిసిందే. జడ్జీ హోదా నుంచి ఆయన్ను తప్పించేందకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జస్టిస్ యశ్వంత్ వర్మ అకస్మాత్తుగా రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు పంపారు. గత ఏడాది ఢిల్లీలోని ఆయన నివాసం నుంచి భారీ ఎత్తున నోట్ల కట్లను రికవరీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రపతికి రాసిన రాజీనామా లేఖలో ఆయన ఎటువంటి కారణాన్ని వెల్లడించలేదు. కానీ తక్షణమే అలహాబాద్ కోర్టు నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ 9వ తేదీన ఆయన ఆ లేఖ రాశారు.

యశ్వంత్ వర్మ రాజీనామా చేయడం వల్ల.. ఆయనపై చేపట్టాల్సిన అభిశంసన ప్రక్రియ నిలిచిపోతుందని లోక్‌సభ సెక్రటేరియట్ వెల్లడించినట్లు ఓ అధికారి ద్వారా తెలిసింది. రాజీనామా తర్వాత జస్టిస్ వర్మకు యధావిధిగా పెన్షన్‌తో పాటు ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందుతాయి. ఒకవేళ ఆయన్ను పార్లమెంట్ తొలగిస్తే, అప్పుడు ఆయనకు బెనిఫిట్స్ అందేవి కాదు. ఢిల్లీ హైకోర్టు జడ్జీగా ఉన్న సమయంలో.. 2025 మార్చి 14వ తేదీన ఆయన ఇంట్లో భారీగా నగదును సీజ్ చేశారు. ఆయన ఉంటున్న క్వార్టర్స్‌లోని స్టోర్‌రూమ్‌లో సగం కాలిన నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో జస్టిస్ వర్మతో పాటు ఆయన భార్య భూపాల్‌లో ఉన్నారు. స్టోర్‌రూమ్‌లో నగదును తాము పెట్టలేదని జడ్జీ చాలా సార్లు తెలిపారు.

## ఎయిడ్స్ ఇంజక్షన్ దాడికి గురైన యువతి ఆత్మహత్య

హైదరాబాద్, ఏప్రిల్ 10:నగరంలోని పోచారం ఐటీకారిడార్ ఓ ఉన్మాది ఎయిడ్స్ ఇంజక్షన్ తో దాడికి గురైన యువతి ఆత్మహత్య చేసుకుంది.

రమణి అనే యువతి పెళ్లికి నిరాకరించిందన్న కసితో మనోహర్ అనే ఎయిడ్స్‌గ్రస్తుడు గత నెల 11న యువతిని బెదిరించి ఎయిడ్స్ ఉన్న రక్త ఇంజక్షన్ ఇచ్చాడు. అన్నోజిగూడ రాజీవ్ గృహ కల్పలో ఉంటున్న యువతి శుక్రవారం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా ఈ ఘటనలో ఇప్పటికే నిందితుడు మనోహర్ ప్రస్తుతం జైలులో ఉన్నాడు

## బట్టల దుకాణాల్లో రహస్య కెమెరాలకు చెక్.. రంగంలోకి షీ నేత్ర టీమ్స్..

హైదరాబాద్, ఏప్రిల్ 10: పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాల్లో రహస్య కెమెరాలతో మహిళలను చిత్రీకరించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. అందుకోసం ఇవాళ (శుక్రవారం) 'షీ నేత్ర టీమ్స్'ను రంగంలోకి దింపినట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో మహిళల భద్రతే లక్ష్యంగా షీ నేత్ర టీమ్స్‌ను ఆయన ప్రారంభించారు.

భాగ్యనగరంలో 7 జోన్లకు 7 ప్రత్యేక షీ నేత్ర టీమ్స్‌ను ఏర్పాటు చేశారు సీపీ సజ్జనార్. ఆయన తన చేతుల మీదుగా ఆయా బృందాలకు కెమెరా డిటెక్టర్ల అందజేశారు. మహిళల ఆత్మగౌరవం, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే రహస్య కెమెరాల గుట్టును ఈ బృందాలు రట్టు చేయనున్నాయి. నగరవ్యాప్తంగా హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు వంటి ప్రదేశాల్లో రహస్య కెమెరాలపై ఉక్కుపాదం మోపనున్నాయి. ముఖ్యంగా బట్టల దుకాణాల్లోని ట్రయల్ రూమ్స్, ప్రైవేట్ ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీలు చేయనున్నారు. ఇకపై అత్యాధునిక కెమెరా డిటెక్టర్లతో ఆకస్మిక సోదాలు నిర్వహించనున్నారు.

ఈ బృందాల ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడిన సీపీ సజ్జనార్.. బట్టల దుకాణాలు, హోటళ్లు, హాస్టళ్లు, మాల్స్ వంటి ప్రాంతాల్లో ఆడవారి భద్రత ఆయా సంస్థల యాజమాన్యాలదే అని తేల్చిచెప్పారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే సంస్థలు, సిబ్బందిని బ్లాక్‌లిస్టులో పెట్టే విధంగా చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రతి సంస్థలో కస్టమర్ సేఫ్టీ ఇన్‌ఛార్జ్ నియామకం తప్పని సరని ఆదేశాలిచ్చారు. షీ టీమ్స్‌తో సమన్వయం కోసం నోడల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆజ్ఞాపించారు.

అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ సూచించారు.

## 40 ఆయుధాల సరెండర్..



హైదరాబాద్, ఏప్రిల్ 10: తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతున్నాయి. డీజీపీ ఎదుట 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోవడం సంచలనంగా మారింది.తెలంగాణ డీజీపీ ఎదుట 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో 11 మంది పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యులు ఉండగా, బెటాలియన్ డిప్యూటీ కమాండర్ సోది కేశాలు కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు. కేశాలు లొంగుబాటును పోలీసులు కీలక పరిణామంగా భావిస్తున్నారు.

లొంగిపోయిన మావోయిస్టులు సుమారు 40 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. వీరిలో ఎక్కువ మంది ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కు చెందినవారేనని అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో 'ఆపరేషన్ ఖగార్' గడువు ముగిసిన తర్వాత కూంబింగ్ చర్యలు తీవ్రతరం కావడంతో, పలువురు మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందినవారని డీజీపీ వెల్లడించారు. అలాగే లొంగిపోయిన మావోయిస్టులకు మొత్తం రూ.1.93 కోట్లు ప్రోత్సాహకంగా అందజేస్తామని ప్రకటించారు.

## రాజ్యసభ ఛైర్మన్‌గా శ్రీ సి.పి. రాధాకృష్ణన్ శ్రీ హరివంశ్ ప్రమాణ స్వీకారం



న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10:గౌరవనీయ రాజ్యసభ ఛైర్మన్, శ్రీ సి.పి. రాధాకృష్ణన్ గారు ఈరోజు పార్లమెంట్ భవనంలో కొత్తగా నామినేట్ అయిన సభ్యుడు శ్రీ హరివంశ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీ హరివంశ్ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్; న్యాయ, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్; రాజ్యసభ సభా నాయకుడు మరియు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా; వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ రామ్ నాథ్ ఠాకూర్; రాజ్యసభ సెక్రటరీ జనరల్ శ్రీ పి.సి. మోడీ మరియు సచివాలయంలోని ఇతర సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయం.. ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు

విశాఖపట్నం, ఏప్రిల్ 10: ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఏపీ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూలై మొదటి వారంలో ఈ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు.

ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇప్పటికే ఆహ్వానం పంపారు. మోదీ షెడ్యూల్ ఆధారంగా జూలై 5వ తేదీ లేదా 8వ తేదీల్లో ఒకటి ఖరారు కానుంది. జూన్ 30వ తేదీ కల్లా మిగిలిన అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తున్నారు.

అంతర్జాతీయ విమానాల రాకపోకల కోసం అవసరమైన ఇమ్మిగ్రేషన్ స్టేటస్ నోటిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేసింది.

విశాఖపట్నం నుంచి భోగాపురం వెళ్లే మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఆనందపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఫ్లై ఓవర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. దీనికి సంబంధించిన డీపీఆర్ 45 రోజుల్లో సిద్ధం కానుంది.భోగాపురం వరకు మెట్రో సౌకర్యాన్ని కల్పించేందుకు ఖీఎంఇూ సంస్థ సవరించిన డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. ఇది డబుల్ డెక్కర్ మోడల్‌లో ఉండబోతోంది (కింద రోడ్డు, పైన మెట్రో). విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి భోగాపురం వరకు ఈ కారిడార్ విస్తరించనుంది.

రోడ్ నంబర్ 12, 14 పనుల కోసం అటవీ, రక్షణ శాఖల అనుమతులను వేగవంతం చేశారు. తీర ప్రాంతం వెంట విశాఖను భోగాపురంతో కలిపే ప్రత్యేక కోస్టల్ కారిడార్ పనులు కూడా ఊపందుకున్నాయి.

భోగాపురం ఎయిరోసిటీ, ఐటీ హబ్స్, లాజిస్టిక్ పార్కుల వల్ల ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి లభించనుంది.

పర్యాటక రంగం: అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ విమానాశ్రయం వల్ల ఉత్తరాంధ్రలోని పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది.

వ్యాపార కనెక్టివిటీ: ఫార్మా, మత్స్య పరిశ్రమల ఎగుమతులకు ఈ విమానాశ్రయం కేంద్ర బిందువుగా మారనుంది.

భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు త్వరలో పూర్తవుతాయని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వ సహకారంతో ఏపీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు జూలై మొదటి వారంలో ప్రారంభించాటానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇదో మైలు రాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించటానికి ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో విషాదం.. ఇన్‌స్టాగ్రామ్‌లో వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్య

హైదరాబాద్, ఏప్రిల్ 10:హైదరాబాద్ శివారు హయత్ నగర్ పరిధిలోని కుంట్లూరులో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సామాజిక మాధ్యమాలు, తోటి విద్యార్థుల వేధింపులు ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. పదోతరగతి చదువుతున్న ఓ బాలిక, తోటి విద్యార్థి వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడింది. కుంట్లూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న బాలిక ఆత్మహత్య స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.తోటి విద్యార్థి వేధింపులే ఈ ఘాతుకానికి కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలు, నిందితుడైన బాలుడు ఒకే పాఠశాలలో పదోతరగతి చదువుతున్నారు. మొదట స్నేహం పేరుతో పరిచయమైన సదరు విద్యార్థి, ఆ తర్వాత తన వక్రబుద్ధిని బయటపెట్టాడు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆ బాలికను నిందితుడు లైంగికంగా వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. విద్యార్థి ప్రవర్తనపై బాలిక, ఆమె కుటుంబ సభ్యులు గతంలోనే పలుమార్లు మందలించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ నిందితుడి ప్రవర్తనలో మార్పు రాకపోగా, వేధింపులు మరింత ఎక్కువయ్యాయి.

నిన్న (గురువారం) ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, మనస్తాపానికి గురైన ఆ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు విగతజీవిగా పడి ఉన్న కూతురుని చూసి కన్నీరుమున్నీరయ్యారు. తీవ్ర ఆవేదనలో ఉన్న బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే, మృతదేహాన్ని తీసుకొని తమ సొంత గ్రామానికి (సాగర్ సమీప ప్రాంతం) వెళ్లిపోయారు.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న హయత్ నగర్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. మృతదేహాన్ని అంత్యక్రియల కోసం తీసుకెళ్తున్న క్రమంలో పోలీసులు మార్గమధ్యంలో (సాగర్ రోడ్డు) వారిని ఆపి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరిగి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడైన బాలుడిపై వేధింపులు, ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు గానూ కేసు నమోదు చేశారు. బాలిక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, ఇన్‌స్టాగ్రామ్ చాటింగ్ వివరాలను విశ్లేషిస్తున్నారు.

సామాజిక మాధ్యమాల వినియోగం విషయంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన మరోసారి హెచ్చరిస్తోంది. పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ, వారికి భరోసా కల్పించడం ద్వారా ఇలాంటి అవాంఛనీయ ఘటనలను నిరోధించవచ్చని పోలీసులు తెలిపారు.

## హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్టులు

హైదరాబాద్, ఏప్రిల్ 10: హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రౌడీ షీటర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. నగరంలో పలు చోట్ల రౌడీల ఆగడాలు మితిమీరిపోతున్నారు.

ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్టులునిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 1300 మందికి పైగా రౌడీ షీటర్లు ఉండగా 250 మందికి పైగా డ్రగ్ టెస్టులను నిర్వహించారు. 190 మందికి గంజాయి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు.

ఎవరైనా గంజాయి సరఫరా చేసినా కొనుగోలు చేసిన కఠిన చర్యలు తీసుకుటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ముఖ్యంగా యువత, విద్యార్థు లు గంజాయి బారిన పడి విలువైన జీవితాలన నాశనం చేసుకోవద్దన్నారు.

## పరీక్షకు హాజరైన విద్యార్థులు.. తేనెటీగల దాడి, బాలుడు మృతి

భోపాల్, ఏప్రిల్ 10: స్కూల్‌లో జరుగుతున్న పరీక్షలు రాసేందుకు విద్యార్థులు హాజరయ్యారు. స్కూల్ ప్రాంగణంలో ఉన్న వారిపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఒక బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మరణించాడు. మధ్యప్రదేశ్‌లోని అగర్ మాల్వా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోయత్ కళలోని స్వామి వివేకానంద పాఠశాలలో పరీక్షలు జరుగుతున్నాయి. కాగా, శుక్రవారం పరీక్షలు రాసేందుకు విద్యార్థులు స్కూల్‌కు చేరుకున్నారు. స్కూల్ ప్రాంగణంలో వారు ఉండగా అక్కడున్న తేనెపట్టుల్లోని తేనెటీగలు వారిపై దాడిచేశాయి. కొందరు పిల్లలను అవి కుట్టాయి. 4వ తరగతి చదువుతున్న 9 ఏళ్ల రామన్ కరాడాతో పాటు మరి కొందరు విద్యార్థులు గాయపడ్డారు.మరోవైపు టీచర్లు వెంటనే స్పందించారు. ఆ తేనెటీగల దాడి నుంచి విద్యార్థులను కాపాడేందుకు ప్రయత్నించారు. గాయ పడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే విద్యార్థి రామన్ ఆరోగ్య పరిస్థితి వేగంగా విషమించింది. దీంతో మెరుగైన చికిత్స కోసం రాజస్థాన్‌లోని ఝులావార్ ఆసుపత్రికి అతడిని తరలించారు. పరిశీలించిన వైద్యులు ఆ బాలుడు మరణించినట్లు ప్రకటించారు.కాగా, ఆ స్కూల్ ప్రాంగణంలో పలు తేనెపట్టులు ఉన్నప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యం వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై స్కూల్ యాజమాన్యం స్పందించింది. ఈ ఘటనపై విచారణ జరుపుతామని, అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

## 200 మిలియన్ డాలర్ల అమెరికన్ డ్రోన్ అదృశ్యం!

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10: హోర్ముజ్ జలసంధిపై ప్రయాణిస్తున్న ఒక అమెరికా నిఘా డ్రోన్ అకస్మాత్తుగా అదృశ్యం కావడం కలకలానికి దారి తీసింది. అత్యంత ఖరీదైన డ్రోన్‌గా పేరున్న ఎమ్‌క్యూ-4సీ ట్రైటన్ నేడు హోర్ముజ్ గగనతలంలో కనిపించకుండా పోయింది. ఎమర్జెన్సీ ప్రకటించిన కాసేపటికే డ్రోన్ కనిపించకుండా పోయిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. యూఎస్-ఇరాన్ చర్చల వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం కలకలానికి దారి తీసింది.

పర్షియన్ గల్ఫ్, హోర్ముజ్ జలాలపై నిఘా కోసం బయలుదేరిన డ్రోన్ దాదాపు మూడు గంటల తరువాత కనిపించకుండా పోయింది. ఫ్లైట్ రాడార్24 డేటా ప్రకారం, ఈ డ్రోన్ మిషన్ అనంతరం తిరిగొస్తూ ఇరాన్ వైపు మళ్లింది. ఆ తరువాత కాసేపటికే ఎమర్జెన్సీ (7700 కోడ్) ప్రకటించింది. ఈ క్రమంలో కిందకు దిగిన డ్రోన్ రాడార్ స్క్రీన్‌లపై కనుమరుగైంది. డ్రోన్‌ను ఎవరైనా కూల్చేశారా లేక మరేదైనా సాంకేతిక లోపం తలెత్తిందా.. అన్న విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు.

దాదాపు 200 మిలియన్ డాలర్ల విలువైన ఈ డ్రోన్‌ను యూఎస్ సెంట్రల్ కమాండ్ పరిధిలోని గల్ఫ్ ప్రాంతంలో మోహరించారు. సముద్రజలాల్లో కీలక ప్రాంతాలపై ఎక్కువ సమయం పాటు నిఘా పెట్టేందుకు అమెరికా ఈ డ్రోన్‌ను వినియోగిస్తోంది. పీ-8ఏ పొసైడన్ పాట్రోల్ ప్లేన్స్‌కు అనుబంధంగా దీన్ని వినియోగిస్తున్నారు. 7,400 నాటికల్ మైళ్ల పరిధిలోని జలాలపై 50 వేల అడుగుల ఎత్తున ప్రయాణిస్తూ 24 గంటలకు పైగా నిఘా కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యం ఈ డ్రోన్ సొంతమని నిపుణులు చెబుతున్నారు. ఇక ప్రస్తుతం యుద్ధం కారణంగా అమెరికాకు క్షణానికి రూ. 9.8 లక్షలు ఖర్చవుతున్నాయని మరికొందరు అంటున్నారు.

## అగ్నిప్రమాదం.. గడ్డపోతారం పారిశ్రామికవాడలో చెలరేగుతున్న మంటలు..

సంగారెడ్డి, ఏప్రిల్ 10: (నేటినిజం ప్రతినిధి):జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. న్యూట్రల్ రసాయన పరిశ్రమలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భారీ అగ్ని కీలలకు పరిశ్రమ చుట్టుపక్కల మొత్తం దట్టమైన పొగ అలుముకుంది. స్థానికుల సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ఫైరింజన్లతో మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు.

ఈ ప్రమాద సమయంలో పలువురు కార్మికులు ఫ్యాక్టరీలో ఉన్నట్లు తెలుస్తోంది. కొంత మంది అక్కడి నుంచి తప్పించుకోగా.. మరికొంతమంది ఇంకా పరిశ్రమలోనే ఉన్నట్లు సమాచారం. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని పలువురు కార్మికులు, స్థానికులు చెబుతున్నారు. అయితే, పలు రకాల రసాయనాల నిల్వలు అక్కడ ఉండడంతో ప్రమాద తీవ్రత పెరిగినట్లు అంటున్నారు. కాగా, ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# సురక్షిత ప్రసవం, ప్రసవానంతర చేయూతతో ఆరోగ్యకర రేపటి తరం !

## (11 ఏప్రిల్ "జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం" సందర్భంగా)

ఆడ జన్మకు సార్ధకత అమ్మతనం. కళ్ల ముందు నడిచే దైవం అమ్మ. పునర్జన్మను పొందినమరో బిడ్డకు ప్రాణం పోసే అమ్మతనం మహిళలకు దేవుడిచ్చిన అపూర్వ అవకాశం. మాతృత్వం ఓ అద్భుత దైవకార్యంతో సమానం. అమ్మ కావడం స్త్రీకి తక్కిన అపురూప వరం. అత్యంత శక్తివంతమైన మాతృత్వం ఓ పరమ పవిత్ర కార్యం. ప్రాణాపాయం ఉంటుందని తెలిసి కూడా అమ్మతనమనే పేరును తెచ్చుకోవడానికి తాను గర్భిణిగా నవమాసాలు బిడ్డను మోసి, ప్రసవ వేదనను సంతోషంగా భరించి, కేరు కేరను ఏడ్చే నవజాత శిశువు స్వరాన్ని వింటూ నొప్పులను మరిచి మురిసి పోతుంది అమ్మ అయిన అతివ.

2026 జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం ఇతివృత్తం:

గర్భిణిగా, ప్రసవంలో, ప్రసవానంతరం కూడా తల్లికి సురక్షిత ఆరోగ్యాన్ని అందించడం మన కనీస బాధ్యత అని గమనించిన "వైట్ రిబ్బన్ అలియెన్స్" సంస్థ చొరవతో ప్రతి ఏట 11 ఏప్రిల్ రోజున భారత దేశవ్యాప్తంగా "జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం (నేషనల్ సేఫ్ మదర్‌హూడ్ డే)" నిర్వహించడం 2003 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రేమ, త్యాగం, అవధులు లేని ధైర్యం అనే విలువలను ఇంధనాలుగా మలిచి మహిళ మాతృత్వాన్ని అనుభవిస్తుంది. మహాత్మాగాంధీ సతీమణి కస్తూర్బ గాంధీ జన్మదినం 11 ఏప్రిల్‌ను పురస్కరించుకొని జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం పాటించుట జరుగుతున్నది. 2026 జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం ఇతివృత్తంగా "మాతృ సంబంధ ఆరోగ్య సురక్ష సమానత్వంలో ఏ తల్లిని వదల వద్దు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

భారత్‌లో మాతాశిశు సంరక్షణ చర్యలు :

ప్రపంచ దేశాల్లో భారతీయ మహిళలు లేదా తల్లులు ప్రమాదకర వాతావరణాల్లో జీవితాలను గడుపుతున్నారని, ప్రపంచ గర్భిణి మహిళల మరణాల్లో 15 శాతం వరకు భారతంలోనే జరుగుతున్నట్లు తేలడం విచారకరం. సాలీనా 44,000 మంది మహిళలు ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో లేదా ప్రసవానంతరం సరైన వైద్య సేవలు అందని కారణంగా మరణిస్తున్నట్లు తెలుస్తున్నది. మన దేశ గర్భిణులు, ప్రసవ సమయంలో లేదా ప్రసవం తర్వాత తల్లులు 12 శాతం వరకు మరణిస్తున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్త తల్లుల మరణాలు 99 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జరగడం గమనార్హం. 190 నుంచి 2015 వరకు 44 శాతం తల్లుల మరణాలు తగ్గడం, 2016 నుంచి 2030 వరకు ఒక లక్ష తల్లుల్లో 70 కన్న తక్కువ మరణాలు నమోదు అయ్యే విధంగా పలు కటుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. గ్రామీణ, పేద వర్గాలకు చెందిన మహిళలు అధికంగా ప్రమాదకర వాతావరణాల్లో బతుకులు ఈడ్చడం జరుగుతున్నది.

మాతాశిశు సంక్షేమం ప్రభుత్వాల కనీస బాధ్యత :

గర్భిణులు, ప్రసవ సమయం, ప్రసవానంతరం తల్లి, బిడ్డ సురక్షకు నాణ్యమైన వైద్య ఆరోగ్య సదుపాయాలు కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత అని తెలుసుకోవాలి. ఈ విధులకు సుశిక్షితులైన వైద్య సిబ్బందిని నియమించడం ప్రభుత్వాల కనీస కర్తవ్యం. మాతాశిశు సంక్షేమమే రేపటి ఆరోగ్యవంతమైన పౌర సమాజ స్థాపనకు పునాదులుగా తీసుకోవాలి. అమ్మతనం అమృత భావం. శిశువుకు తెలిసిన తొలి దైవం కన్న తల్లి మాత్రమే. ఇంట్లో కొలువైన అమాయక బాధ్యతగల ప్రేమ మూర్తి అమ్మ మాత్రమే. మాతృత్వం కోసం పరితపించే మహిళ నుంచి ప్రసవానంతర తల్లి వరకు అన్ని దశల్లో మాతృ శిశు ఆరోగ్యాన్ని బలపరచడం మన కనీస బాధ్యత.

అమ్మతనం పట్ల అవగాహన, తల్లులు లేదా గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రసవ సమయ సవాళ్లను అధిగమించడం, సురక్షిత ప్రసవం, ప్రసవానంతర చర్యలు తీసుకోవడం లాంటి అంశాలే కేంద్రంగా జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం కొనసాగాలి. అమ్మ లేని తనువు లేదు. అమ్మ ప్రేమకు తత్సమాన బంధం లేదు. అమ్మ ద్వేషించే బిడ్డ ఉండదు. తల్లి పాసు రుచి చూదని తనువు లేదు. అమ్మను ప్రసవ సమయంలో కోల్పోయిన బిడ్డలంత దురదృష్టవంతులు లేరు. అమ్మ మనసు వెన్నంట మృదువు. అమ్మ ప్రేమ కలుషితం కాని అనుభవం. మాతృత్వానికి తలవంచి, అమ్మకు పాదాభివందనం చేసి, నేటి భార్యను రేపటి తల్లిగా భావించి తగు జాగ్రత్తలు తీసుకుందాం. మాతాశిశు సంక్షేమానికి గొడుగు పడదాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ప్రపంచ హోమియోపతి దినోత్సవం చర్చావేదికను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10: ఆయుష్ మంత్రిత్వ శాఖ 2026 సంవత్సరం ఏప్రిల్ 10న 'ప్రపంచ హోమియోపతి దినోత్సవం' సందర్భంగా ఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్లో రెండు రోజుల పాటు సాగే చర్చావేదికను ఏర్పాటు చేయనుంది. విధాన రూపకర్తలు, పరిశోధకులు, అభ్యాసకులు, ప్రతినిధులు సుస్థిర ఆరోగ్యసంరక్షణ వ్యవస్థను తీర్చిదిద్దడంలో హోమియో వైద్యశాస్త్రం పోషిస్తున్న పాత్ర నానాటికీ విస్తరించడంపై తమ ఆలోచనలను ఈ కార్యక్రమంలో పంచుకొంటారు.

"నిలకడైన ఆరోగ్యం కోసం హోమియోపతీ'' ఇతివృత్తం ప్రధానంగా ఈ సంవత్సరంలో నిర్వహించబోయే ఉత్సవంలో, స్వాస్థ్య సేవల్ని అందించడానికి హోమియోపతీ సమగ్రమైన, తక్కువ ఖర్చుతో కూడిన, పర్యావరణం పరంగా బాధ్యత కలిగిన దృష్టికోణంతో ముందుకు పోతోందని చాటిచెబుతారు. అలాగే, అందరికీ స్వాస్థ్య సంరక్షక సేవల్ని అందించడం, ఐక్య రాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) వంటి ప్రపంచ ప్రాధాన్యాలు, ప్రత్యేకించి చక్కని ఆరోగ్యం, సంక్షేమం అంశాలపై ఎస్‌డీజీ 3 ఏం చెబుతోందనే అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు.

కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్ రావ్ జాదవ్, ఆయుష్ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేశ్ కొటేచా, ప్రభుత్వ సీనియర్ అధికారులతో పాటు దేశవ్యాప్తంగా ప్రముఖ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసర్చ్ ఇన్ హోమియోపతీ (సీసీఆర్‌హెచ్) నిర్వహించే ఈ కార్యక్రమంలో.. హోమియోపతీ రంగంలో విశేష పరిశోధనల రీత్యా చోటు చేసుకున్న ప్రగతి, ప్రజారోగ్య కార్యక్రమాలు, విధానపరమైన అభివృద్ధి వంటి వాటిని వివరిస్తారు. దీనిలో విజ్ఞానశాస్త్ర రీత్యా చెల్లుబాటునూ , నైతిక ప్రమాణాలనూ పటిష్ఠపంచడం, ప్రధాన స్రవంతికి చెందిన ఆరోగ్యసంరక్షణ వ్యవస్థలతో హోమియోపతీని ఏకీకరించడంపైన కూడా చర్చిస్తారు.

ఆరోగ్యసంరక్షణకు సంబంధించిన ఖర్చులు రోజురోజుకూ పెరిగిపోతుండడం, పాత రోగాల తాలూకు భారం అధికమవడం, సూక్ష్మజీవినాశక మందులకు ఎదురొడ్డి నిలిచే వ్యవస్థ మనుషుల శరీరాల్లో బలపడుతుండడం (యాంటిమైక్రోబియల్ రెసిస్టెన్స్) తదితర ఆందోళనకారక పరిణామాల నేపథ్యంలో, హోమియోపతీని ఒక మన్నిక కలిగిన చికిత్స వ్యవస్థగా ఈ కార్యక్రమం వెలుగులోకి తీసుకురానుంది. కనీస స్థాయి పర్యావరణ పాదముద్ర, వనరులను హేతుబద్ధ రీతిలో ఉపయోగించడంతో పాటు మానవ దేహంలో స్వతస్సిద్ధంగా అమరి ఉన్న ఉపచార యంత్రాంగాన్ని ఉత్తేజితం చేయడం హోమియోపతీ వైద్య విధానంలో కొన్ని ప్రత్యేకతలన్న సంగతి తెలిసిందే.

ప్రత్యేక సమావేశాల్లో నివారక ప్రధాన, ప్రోత్సాహపూర్వక ఆరోగ్యసంరక్షణలోనూ, జీవన శైలితో పాటు దీర్ఘకాలిక రోగాల నిర్వహణలోనూ హోమియోపతీ పోషిస్తున్న భూమిక, సాంప్రదాయిక ఔషధచికిత్సపై ఆధారపడడాన్ని తగ్గించడంలో హోమియోపతీ అందిస్తున్న తోడ్పాటునూ పరిశీలించనున్నారు. చర్చల్లో పర్యావరణానుకూల ఔషధ పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ, సాంప్రదాయిక జ్ఞానాన్ని ఆధునిక విజ్ఞానశాస్త్ర పరిశోధనతో ఏకీకరించడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వడం వంటి అంశాలపైన కూడా దృష్టిని కేంద్రీకరిస్తారు.

గత కొన్ని సంవత్సరాల్లో భారత్లోనూ, ప్రపంచ స్థాయిలోనూ విశేషించి సమాజ ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్య సంబంధిత కార్యక్రమాల్లో హోమియోపతీ వైద్య విధానానికి గతం కన్న మరింత ఎక్కువ ఆదరణ లభిస్తోంది. ఫలితాలపై ఆధారపడ్డ పద్ధతులు, మెరుగైన లభ్యత, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో ఏకీకరణ.. ఈ మార్గాల్లో హోమియోపతీ పరిధిని విస్తరించడానికి ఆయుష్ శాఖ చురుకుగా పని చేస్తోంది.

సాంప్రదాయిక చికిత్స వ్యవస్థలను ప్రోత్సహించడంలో భారత్ నాయకత్వాన్ని మరింత బలపరచడంతో పాటు ఆటుపోట్లకు తట్టుకొని నిలిచే, సమ్మిళిత, మన్నిక కలిగిన ఆరోగ్యసంరక్షక సేవల అనుబంధ విస్తారిత వ్యవస్థను నిర్మించే దిశగా చేస్తున్న కృషికి 'ప్రపంచ హోమియోపతీ దినోత్సవం-2026' ఒక కొత్త వేగాన్ని అందిస్తుందని భావిస్తున్నారు.

ఈ కార్యక్రమం ఆసక్తిదారు వర్గాల నడుమ చర్చలు, సహకారం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుంది. దీంతో స్వాస్థ్య సేవ కేవలం ప్రభావవంతంగా మారడమే కాకుండా సమానావకాశాల్ని అందించే, పర్యావరణం పట్ల చైతన్యాన్ని కలిగి ఉండే మన్నికైన భవిష్యత్తు దిశగా సాగేందుకు కూడా ఈ కార్యక్రమం ఒక బాటను ఏర్పరుస్తుంది.

# కాండ్లా పోర్ట్ మిథనాల్ బంకరింగ్‌లో పురోగతి, హరిత సముద్రయాన పరివర్తన దిశగా కీలక అడుగు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10: సముద్రయాన రంగాన్ని డీకార్బనైజ్ చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగులో, దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ (కాండ్లా పోర్ట్) తన మిథనాల్ బంకరింగ్ సామర్థ్యాలను మెరుగుపరుచుకుంది. తద్వారా భారతదేశ ఇంధన పరివర్తన ప్రయత్నాలలో మరియు ప్రపంచ హరిత షిప్పింగ్ కారిడార్లలో ఒక కీలక పాత్రధారిగా నిలిచింది. 2050 నాటికి నికర-సున్నా ఉద్గారాలను సాధించాలనే సముద్రయాన రంగ లక్ష్యానికి అనుగుణంగా, ఈ చొరవ షిప్పింగ్‌లో గ్రీన్‌హౌస్ వాయువుల తీవ్రతను తగ్గించడానికి ఇ-మిథనాల్ మరియు ఇ-అమ్మోనియా వంటి తక్కువ-కార్బన్ ప్రత్యామ్నాయ ఇంధనాలను స్వీకరించడంపై దృష్టి పెడుతుంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సుస్థిర సముద్ర రంగ వృద్ధికి భారతదేశం దృఢంగా కట్టుబడి ఉందని ఈ చొరవ ప్రతిబింబిస్తోందని కేంద్ర ఓడరేవులు, నౌకాయానం మరియు జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు.

కాండ్లా పోర్టులో సాధించిన ఈ మైలురాయి, హరిత నౌకారవాణా దిశగా ప్రపంచ పరివర్తనకు నాయకత్వం వహించాలన్న భారతదేశ సంకల్పాన్ని చాటిచెబుతోంది. మిథనాల్ వంటి స్వచ్ఛమైన ఇంధనాలను స్వీకరించి, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను నిర్మించడం ద్వారా, మనం మన సముద్ర రంగాన్ని అంతర్జాతీయ సుస్థిరత లక్ష్యాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతూనే, సామర్థ్యాన్ని, పోటీతత్వాన్ని పెంచుతున్నాము. "2047 నాటికి విక్సిత్ భారత్ దార్శనికతను సాకారం చేసుకునే దిశగా మనం ముందుకు సాగుతున్నందున, ప్రపంచంలోని అగ్రశ్రేణి సముద్రయాన దేశాలలో ఒకటిగా మారే మన ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన అడుగు'' అని సర్బానంద సోనోవాల్ అన్నారు.

భారతదేశ పశ్చిమ తీరంలో ఉన్న కాండ్లా పోర్ట్, చాలా కాలంగా గ్రే మిథనాల్‌ను కార్గోగా నిర్వహిస్తోంది మరియు ఇప్పటికే ట్యాంక్ నిల్వ, పైప్‌లైన్‌లు మరియు జెట్టీలతో సహా అనుకూలమైన మౌలిక సదుపాయాలను కలిగి ఉంది. ఈ పునాదిపై, పోర్ట్ ఇప్పుడు ప్రత్యేక మిథనాల్ బంకరింగ్ సామర్థ్యాలను చురుకుగా అభివృద్ధి చేస్తోంది.

సంసిద్ధతను అంచనా వేయడానికి, కాండ్లా పోర్ట్ ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను మరియు నియంత్రణ, భద్రతా చట్రాల సమగ్రతను మూల్యాంకనం చేయడానికి ఆఔఎ మారిటైమ్ అడ్వైజరీ సర్వీసెస్‌ను నియమించింది. ఈ అంచనా తర్వాత, మిథనాల్ బంకరింగ్ కోసం ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పోర్ట్స్ అండ్ హార్బర్స్ (ఎంఖఊ) పోర్ట్ రెడీనెస్ లెవెల్ (ఖఖీఒ) స్కేల్‌పై పోర్ట్‌కు లెవెల్ 6 రేటింగ్ ఇవ్వబడింది.

# రోడ్డు ప్రమాదాల నివారించేందుకు కృషి



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10:ఎన్టీఆర్ జిల్లా ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ శుక్రవారం ఎన్ హెచ్ - 65 పై బ్లాక్ స్పాట్స్ పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కేతనకొండ గ్రామానికి బస్సు యాత్ర చేరుకుంది. జిల్లా ప్రభుత్వ అధికారులతో కలిసి కేతనకొండ, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, వారధి, ఎనికేపాడు 24కే కల్యాణ మండపం వరకు ప్రత్యక్షంగా పరిశీలించి మొత్తం 28 బ్లాక్ స్పాట్స్ (రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు)ను గుర్తించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు సూచనలు, చర్యలు చేపట్టనున్నారు. ఎన్ హెచ్ - 65 పై ఇబ్రహీంపట్నంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని, ప్రజలంతా సహకరించాలని కోరారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నిబంధనల పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ లో డివైడర్ లు వెడల్పు తగ్గించడం, రింగ్ వెడల్పు తగ్గించడం, వేగ నియంత్రణ వంటి ప్రధాన అంశాలను గుర్తించామన్నారు. త్వరలోనే చర్యలు చేపడతామని తెలిపారు.

# చిలకలూరిపేట సమీపంలో న్యాయవాది అనుమానాస్పద మృతి

చిలకలూరిపేట, ఏప్రిల్ 10: చిలకలూరిపేట మండల పరిధిలోని ఎడవల్లి గ్రామం సమీపంలో చీమకుర్తికి చెందిన న్యాయవాది శ్రీరామ్ హరిప్రసాద్ (39) మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. శుక్రవారం రోడ్డుపై ఆయన మృతదేహంపై స్కూటర్ పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన న్యాయవాది శ్రీరామ్ హరిప్రసాద్‌గా గుర్తించారు. ఘటన స్థలంలో స్కూటర్ పడి ఉన్న తీరు, మృతదేహంపై గాయాల ఆధారంగా ఇది ప్రమాదమా లేదా ఎవరైనా ఉద్దేశపూర్వకంగా దాడి చేశారా అనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సమాచారం అందిన వెంటనే ఎస్సై అనిల్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత ఇది ప్రమాదమా లేక హత్యా అన్న విషయంపై పూర్తి స్పష్టత వస్తుందని ఎస్సై తెలిపారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి



సంగారెడ్డి, ఏప్రిల్ 10 (నేటి నిజం ప్రతినిధి )సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఏప్రిల్ 11న నిర్వహించనున్న వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఎం.బి.సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రామ్ జోషి హన్మంతు పిలుపునిచ్చారు.

శుక్రవారం స్థానిక ఐబీ కార్యాలయంలో ఈ వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని పలువురు ప్రముఖులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్ జోషి హన్మంతు మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసి, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు.

ఆయన ఆశయాలను స్మరించుకుంటూ, ఈ జయంతి వేడుకల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు కూన సంతోష్, సంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కశపాగ ఇమ్మయ్య, దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు తలారి యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపాక విజయరాజు, సీనియర్ జర్నలిస్టులు దేవదాసు, చంద్రశేఖర్, మునిపల్లి ఆనంద్, ఎర్రారం దేవదాసు తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# విద్యుత్ ఆర్టిజన్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

నల్గొండ, ఏప్రిల్ 10: విద్యుత్ శాఖలో కొన్నేండ్లుగా ఆర్టిజన్స్ కార్మికులుగా పని చేస్తున్న వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ తుంగతుర్తి మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కార్మికులు గత మూడు రోజులుగా డివిజన్ కార్యాలయాల ముందు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఇది ప్రభుత్వ బాధ్యతారాహిత్యమని ఆరోపించారు. ఎన్నికలకు ముందు పాదయాత్ర చేసిన కాంగ్రెస్ పెద్దలు అధికారం రాగానే పర్మినెంట్ చేస్తామని చెప్పి ఓట్లు దండుకుని రెండున్నర ఏండ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

# ఐటీసీ యాజమాన్యం చర్చలకు పిలవకపోతే ఏ క్షణమైనా సమ్మె

## - కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ హెచ్చరిక

ఖమ్మం, ఏప్రిల్ 10:: కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఐటీసీ యాజమాన్యం పరిష్కరించేందుకు కార్మిక సంఘాల నాయకులను చర్చలకు పిలవకపోతే ఏ క్షణమైనా సమ్మెబాట తప్పదని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లెం నాగయ్య, ఎండీ యాకూబ్‌పాషా హెచ్చరించారు. శుక్రవారం 16వ రోజుకు చేరిన దీక్షా శిబిరంలో కందాల వెంకటరెడ్డి, చుక్కపల్లి బాలాజీ, రూప కల్యాణ్, వల్లోజి కమల, వర్కా సుజాత పాల్గొనగా ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి, ప్రజాపంథా భద్రాచలం డివిజన్ కమిటీ సభ్యుడు సాయిబాబులు దీక్షా శిబిరం వద్దకు వచ్చి కాంట్రాక్టు కార్మికులకు మద్దతు పలికి వారి న్యాయమైన కోర్కెలు యాజమాన్యం తీర్చాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఐటీసీపై ఉందని, రిలే దీక్షలు చేపట్టి 16 రోజులైనా ఐటీసీ యాజమాన్యం కార్మికులను పట్టించుకోకపోవడం సిగ్గుచేట న్నారు. ఇప్పటికైనా కార్మిక సంఘ నాయకులను చర్చలకు పిలిచి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఎప్పుడైనా ఏ క్షణమైనా సమ్మె తప్పదని హెచ్చరించారు.

# యువజన మార్పిడి ద్వారా

# 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తి బలోపేతం: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10:కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్వహించిన 'వతన్ కో జానో' కార్యక్రమంలో పాల్గొంటున్న జమ్మూ కాశ్మీర్‌కు చెందిన 250 మంది యువజన ప్రతినిధి బృందం, ఈరోజు న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి. పి. రాధాకృష్ణన్‌ను కలిసింది.

'వతన్ కో జానో' కార్యక్రమం అనేది కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మరియు జమ్మూ ఉ కాశ్మీర్ ప్రభుత్వం చేపట్టిన ఒక కార్యక్రమం. జమ్మూ ఉ కాశ్మీర్ యువతకు భారతదేశంలోని వివిధ ప్రాంతాలను అన్వేషించే అవకాశాన్ని కల్పించడం ద్వారా జాతీయ సమైక్యతను పెంపొందించడమే దీని లక్ష్యం.

ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, జమ్మూ ఉ కాశ్మీర్‌కు చెందిన ఇంతటి ఉత్సాహభరితమైన, ప్రతిభావంతులైన, మరియు దృఢ నిశ్చయం గల యువతతో సంభాషించడం తనకు ఆనందంగా ఉందని అన్నారు. గత నెలలో కాశ్మీర్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం కోసం తాను శ్రీనగర్‌లో పర్యటించిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, జమ్మూ ఉ కాశ్మీర్‌లో మహిళా అభివృద్ధి మరియు సాధికారతలో గణనీయమైన పురోగతిని చూసినట్లు ఆయన పేర్కొన్నారు.

జమ్మూ ఉ కాశ్మీర్ క్రికెట్ జట్టు తొలిసారిగా రంజీ ట్రోఫీని గెలుచుకోవడాన్ని కూడా ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. విద్యారంగంలో మహిళల నాయకత్వం మరియు యువ క్రికెటర్ల ఇటువంటి క్రీడా విజయాలు, జమ్మూ ఉ కాశ్మీర్ యువత భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ప్రగతిశీల దిశను ప్రతిబింబిస్తున్నాయని ఆయన అన్నారు.

వతన్ కో జానో' కార్యక్రమానికి గాను కేంద్ర హోం మంత్రిత్వ శాఖను ప్రశంసిస్తూ, ఆయన ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఉమ్మడి జాతీయ గుర్తింపు భావనను పెంపొందించడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసం, అవగాహన, ఆశయాలను పెంపొందిస్తాయని, అలాగే "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" స్ఫూర్తిని ప్రోత్సహిస్తాయని అన్నారు.

జమ్మూ కాశ్మీర్ అసాధారణమైన ప్రకృతి సౌందర్యం, గొప్ప సంస్కృతి గల ప్రదేశమని ఆయన పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్ ఒక ప్రధాన ప్రపంచ పర్యాటక కేంద్రంగా మారే సామర్థ్యం కలిగి ఉందని ఆయన అన్నారు. విద్య, సాంకేతికత, పర్యాటకం, వ్యవస్థాపకత రంగాలలో అవకాశాలు విస్తరిస్తున్న కొద్దీ, ప్రతి యువత శాంతియుత, సుసంపన్నమైన, సమ్మిళిత భవిష్యత్తును నిర్మించే వ్యక్తిగా ఎదిగే సామర్థ్యం కలిగి ఉంటారని ఆయన అన్నారు. తమ సామర్థ్యాలను విశ్వసించాలని, తమ మూలాలతో మమేకమై ఉండాలని, జమ్మూ కాశ్మీర్‌ను దేశానికి సామరస్యం, అభివృద్ధి, స్ఫూర్తికి ప్రతీకగా నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఆయన యువతను కోరారు.

## ప్రేమించిన యువతినే హత్య

అమరావతి, ఏప్రిల్ 10:కడప జిల్లా లో దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో యువతిని వేధించిన వ్యక్తి చివరకు ఆమెను హత్య చేయడం కలకలం రేపింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా ఖాజీపేట లో ప్రేమోన్మాది దారుణానికి పాల్పడ్డాడు. తనను పెళ్లి చేసుకోలేదనే కోపంతో శ్రీనివాసులు అనే వ్యక్తి యువతిని గొంతుకోసి హత్య చేశాడు.

ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన యువతిని వెంటనే కడప రిమ్స్ ఆసుపత్రి కి తరలించే ప్రయత్నం చేశారు. అయితే మార్గమధ్యలోనే ఆమె ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆగ్రహం, ఆందోళనలకు దారితీసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# రాచూరులో కాఫీ విత్ క్యాడర్..



అమరావతి, ఏప్రిల్ 10:శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని రొద్దం మండల కేంద్రం నారనాగేపల్లి పంచాయతీ పరిధిలోని రాచూరు గ్రామంలో మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ "కాఫీ విత్ క్యాడర్" కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. నాడు జగనన్న ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతి కుటుంబానికి ప్రతి ఏడాది సంక్షేమ పథకాల ద్వారా ఎలాంటి లోటు లేకుండా లబ్ధి చేకూరిందని ఆమె గుర్తు చేశారు.

ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి, లేనిపోని హామీలతో గెలిచి అనంతరం తీవ్ర అన్యాయం చేసిందని గ్రామ ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వంలో అందిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు గుర్తుంచుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రొద్దం మండల ప్రజాప్రతినిధులు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నారనాగేపల్లి పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఘన సన్మానం



నల్గొండ, ఏప్రిల్ 10:మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణను ఆర్టిఐ ప్రచార కమిటీ ఫౌండర్ ఉ చైర్మన్ రాచూరి మల్లికార్జున్, ఎక్స్ ప్యాక్స్ చైర్మన్ ఉ కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి ఘనంగా సన్మానించారు. బెజ్జంకి మండలం గూడెం గ్రామంలో 63 ఎకరాల 18 గుంటల భూమికి సంబంధించిన మ్యూటేషన్, భూసర్వే సమస్యలను పరిష్కరించి 35 మంది దళిత లబ్ధిదారులను పట్టాదారులుగా మార్చినందుకు ఈ సన్మానం నిర్వహించారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ఎన్నికల హామీ మేరకు ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించి న్యాయం చేశారని పేర్కొన్నారు. భూములకు విద్యుత్ సౌకర్యం, వ్యవసాయ బావులు కల్పించాలని విన్నవించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. మండలంలోని ఇతర పెండింగ్ భూ సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సముద్రాల లక్ష్మణ్, రెడ్డిగాని రాజు, మామిడి అనిల్, మీసాల అంజయ్య, బోయిని కొమురయ్య, ఎలుక రాజు, మాతంగి లక్ష్మణ్, కన్నం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న కేసీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి చేరిక.. జగిత్యాలలో భారీ బహిరంగ సభ

సిద్దిపేట, ఏప్రిల్ 10: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి ఈనెల 20న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారని మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్ , ఎల్ రమణ వెల్లడించారు. ఎర్రవల్లి లోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌తో జీవన్‌రెడ్డి భేటీ అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

బీఆర్ఎస్ ప్లీనరీ సభకు ముందే జగిత్యాలలో నిర్వహించే భారీ బహిరంగ సభలో భారీగా చేరికలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలో రైతు సమస్యలతో ప్రజా సమస్యలపై బహిరంగ సభ నిర్వహించబోతున్నామని వెల్లడించారు. కేసీఆర్ తో కలిసి పని చేయడానికి జీవన్ రెడ్డి ముందుకు రావడం సంతోషమని వివరించారు. కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి రాబోతున్నారని, ప్రజా సమస్యలపై ఇకపై నిరంతరం పోరాటం చేస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతామని స్పష్టం చేశారు.

## తహసీల్దార్ నరేష్‌కు ఘన సన్మానం

నల్గొండ, ఏప్రిల్ 10: కొడిమ్యాల మండల తహసీల్దార్ కార్యాలయంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ డి. నరేష్‌ను శుక్రవారం మీ సేవ నిర్వాహకులు కలసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరేష్ మాట్లాడుతూ, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు. ఇంతకుముందు కొడిమ్యాలలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఎం. కిరణ్ కుమార్ మల్యాల మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో నజీర్, గణేష్, రాకేశ్, మల్లేశం, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

# యువ శాసనసభ్యులు, వికసిత్ భారత్ @2047కు ఉత్ప్రేరక కారకాలు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10: రాజ్యసభ గౌరవ డిప్యూటీ ఛైర్మన్ శ్రీ హరివంశ్ నారాయణ్ సింగ్, పనాజీలో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (ఇండియా రీజియన్), జోన్ 7 సమావేశంలో ప్లీనరీ ప్రసంగం చేస్తూ, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో యువ శాసనసభ్యుల కీలక పాత్రను నొక్కి చెప్పారు.

తన ప్రసంగంలో, శ్రీ హరివంశ్, భారతదేశం "అమృత్ కాలం" అనే పరివర్తన దశ గుండా వెళుతోందని, రాబోయే రెండు దశాబ్దాలు అభివృద్ధి చెందిన, సమ్మిళిత, మరియు పటిష్టమైన దేశాన్ని తీర్చిదిద్దడంలో నిర్ణయాత్మకంగా ఉంటాయని హైలైట్ చేశారు. యువ పార్లమెంట్ సభ్యులు మరియు శాసనసభలు, వారి శక్తి, ఆవిష్కరణలు, మరియు పౌరుల ఆకాంక్షలతో ఉన్న సన్నిహిత సంబంధంతో, ఈ జాతీయ లక్ష్యానికి కీలక చోదకులుగా ఉన్నారని ఆయన నొక్కి చెప్పారు.

గత దశాబ్ద కాలంలో భారత దేశం సాధించిన అద్భుతమైన పురోగతిని ప్రస్తావిస్తూ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ పాలన, ఆర్థిక సమ్మిళితం, మరియు చైతన్యవంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ వృద్ధిలో సాధించిన పరివర్తనాత్మక విజయాలను ఆయన ఎత్తి చూపారు. డిజిటల్ ఇండియా మరియు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ వంటి కార్యక్రమాలు పారదర్శకత, సామర్థ్యం, ??మరియు పౌర-కేంద్రీకృత సేవల పంపిణీని గణనీయంగా మెరుగుపరిచాయని, అదే సమయంలో గ్రామీణ జనాభాను సైతం డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో చురుకుగా పాల్గొనేలా శక్తివంతం చేశాయని ఆయన పేర్కొన్నారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న సమాచార యుగంలో ఇంధన భద్రతా ఆందోళనలు, ప్రపంచ అనిశ్చితులు, మరియు పెరుగుతున్న ప్రజల అంచనాలతో సహా దేశం ముందున్న కొత్త సవాళ్లను కూడా శ్రీ హరివంశ్ అంగీకరించారు. క్షేత్రస్థాయిలో జాతీయ ప్రాధాన్యతలను అమలు చేయడంలో రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తూ, సహకార సమాఖ్యవాదం అత్యవసరమని ఆయన నొక్కి చెప్పారు.

# 'ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు అరికట్టాలి'

## - కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణకు రాజకీయ, రైతు నాయకుల వినతి



నల్గొండ, ఏప్రిల్ 10:ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీటిని వెంటనే అరికట్టాలని కోదాడ నియోజకవర్గ వివిధ రాజకీయ పార్టీలు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. మిల్లర్లు 70 కిలోల బస్తాకు కిలో తరుగు పేరుతో, టన్నుకు 5 కిలోల చొప్పున నికర బరువులో తగ్గిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రైవేటు వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు బస్తాకు రెండున్నర కిలోల వరకు కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎంటీ, చింట్లు వంటి సన్న రకాలను మద్దతు ధర కంటే రూ. 200 నుండి 300 తక్కువకు కొనుగోలు చేస్తున్నారని, దీనిపై మిల్లర్లు, వ్యాపారులతో తక్షణమే సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను నివారించి రైతులకు న్యాయం చేయాలన్నారు. స్పందించిన ఆర్డీఓ సోమవారం రోజున రైతులు, కమీషన్ ఏజెంట్లు, ధాన్యం వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు బొల్లు ప్రసాద్, కనగాల నారాయణ, దొడ్డ వెంకటయ్య, మెదరమెట్ల వెంకటేశ్వరరావు, ముత్యాలు, నరసింహారావు, రైతులు కమతం రాజేశ్వరరావు, వీరేపల్లి కృష్ణమూర్తి, బొమ్మ కంటి వీరబాబు, బైరాబోయిన వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో రైతు మృతి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10: నారాయణపేట జిల్లా నర్వ మండలం బేక్కర్ పల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ( ఇశ్రీవఇబితీతిఇ హ్రాష్ట్రనీఇ.ఎ) రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన భీంసాని రాములు (45) అనే రైతు గురువారం రాత్రి చెరుకు తోటకు నీరు పెట్టేందుకు వెళ్లి పొలం చుట్టూ అమర్చిన విద్యుత్ కంచెకు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

# యమునా నదిలో పడవ బోల్తా.. పది మంది మృతి, పలువురు గల్లంతు



లక్నో, ఏప్రిల్ 10: పర్యాటకులతో వెళ్తున్న పడవ యమునా నదిలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పది మంది మరణించారు. మరికొందరు గల్లంతయ్యారు. పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. (ఎనీజీబి ఇజీజూబతీళివబ తిని ఎతీతీనిటజీలజీని) ఉత్తరప్రదేశ్‌లోని మథుర జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పంజాబ్‌లోని లూథియానాకు చెందిన సుమారు 30 మంది ఉత్తరప్రదేశ్‌లోని బృందావనాన్ని సందర్శించారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు బోట్లలో యమునా నదిలో ప్రయాణించారు.

కాగా, బలంగా వీచిన గాలులకు ఒక బోటు తీవ్రంగా ఊగిపోయింది. పాంటూన్ వంతెనను ఢీకొట్టడంతో ఆ పడవ బోల్తా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నదిలో గల్లంతైన వారి కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.

మరోవైపు పంజాబ్‌లోని లూథియానాకు చెందిన పది మంది పర్యాటకుల మృతదేహాలను ఇప్పటివరకు వెలికితీశారు. నదిలో గల్లంతైన మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీతో సహా పలువురు ఉన్నతాధికారులు పరిస్థితిని పర్యవేక్షించేందుకు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

# కాన్వాయ్ ఆపి వ్యాపారుల సమస్యలు విన్న ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 10: చిరు వ్యాపారుల సమస్యలను తెలుసుకునేందుకు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి తన కాన్వాయ్‌ను ఆపి వారితో మాట్లాడిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది.

అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే కోసం ఎదురుచూస్తున్న చిరు వ్యాపారులను గమనించిన ఆయన, మంత్రిగారి పర్యటనకు వెళ్తూ మధ్యలోనే కాన్వాయ్ ఆపి వ్యాపారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చి ముందుకు సాగారు. ఈ సందర్భంగా వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే స్వయంగా వచ్చి తమ సమస్యలు తెలుసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాపారుల సంఘం అధ్యక్షుడు పొదిల రామయ్య, కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా అంబేద్కర్ చౌరస్తాలో వీధి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, సరైన షెడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గతంలో కొన్ని షెడ్లు నిర్మించినప్పటికీ, ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు అధికారులను కోరామని పేర్కొన్నారు.

డ్రైనేజీ నిర్మాణం ఎత్తుగా ఉండటంతో వ్యాపారం చేసేందుకు ఇబ్బందిగా మారిందని, దీనిని సరిచేసి షెడ్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీతో తమ సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీధి వ్యాపారులు సాదిక్, ఖాజా, రవీంద్రాచారి, బంగారయ్య, భాస్కర్, నరసింహ, ఆరిఫ్, సుధాకర్, లక్ష్మయ్య, శశికళ, సుజాత, పద్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నపోర్లలో చెక్కులు పంపిణీ..

ఆదిలాబాద్, ఏప్రిల్ 10:నారాయణపేటజిల్లాఊట్కూర్ మండల పరిధిలోని చిన్నపోర్లలో సర్పంచ్ గాండ్ల నిఖిత ప్రశాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు గ్రామంలో 15 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశామని అన్నారు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో గుర్తించిన వివిధ సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తానని అన్నారు. మంత్రి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్,లబ్ధిదారులు డబ్బులు వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 3వవార్డు సభ్యుడు గాజుల బందేనావజ్,

# రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి..

ఆదిలాబాద్, ఏప్రిల్ 10:ఊట్కూర్ మండల పరిధిలోని కొత్తపల్లి బీటీ రోడ్డు పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని బిజ్వార్ ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి కోరారు. శుక్రవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధి లోని కొత్తపల్లి బీటీ రోడ్డు ప్రారంభం కావడంతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా బిజ్వార్ నుండి కొత్తపల్లికి బీటీ రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో బీటీ రహదారి పనులు కొనసాగుతున్నాయని పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. బీటీ రహదారి పనులు అధికారులు పరవేక్షిస్తూ సకాలంలో పూర్తి చేయాలని కోరారు.

# 'ఆపరేషన్ రోప్'ను సమర్థవంతంగా అమలు చేయాలి : ఎస్పీ నరసింహ



వరంగల్, ఏప్రిల్ 10:ఆపరేషన్ రోప్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి పాదాచారులకు, పౌరులకు, వాహనదారులకు ఇబ్బందులు తొలగించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సిబ్బందికి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ పోలీస్ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ, పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

పట్టణ కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్యను అధిగమించాలని, రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులను సర్దుబాటు చేయాలని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ను ఆధునీకరించాలని, వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట, కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, శివశంకర్, ట్రాఫిక్ ఎస్ఐలు సాయిరాం, అంజిరెడ్డి పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల స్థలాన్ని పేదలకు పంచాలి

## –సిపిఐ పార్టీ నాయకులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10: కంకణాల గూడెం రెవెన్యూ పరిధిలో అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ల స్థానంలో ఇంటి స్థలాలు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలనీ సిపిఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. నారాయణపురం మండలంలోని కంకణాలగూడెం రెవిన్యూ పరిధిలో 164 సర్వే నెంబర్ లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాల స్థానంలో ఇండ్ల స్థలాలు లేని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం స్థలం పంపిణీ చేయాలని సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ఆ స్థలాన్ని పరిశీలించి తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, చిలువేరు అంజయ్య, పల్లె మల్లారెడ్డి, ఈద మల్లయ్య, వందుల యాదగిరి, రుద్ర రాములు, చిలువేరి అంజయ్య, సురపల్లి జనార్ధన్,యాదయ్య తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ హోమియోపతి దినోత్సవం 2026ను పురస్కరించుకుని కేంద్ర మంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్ 2 రోజుల ఇంటరాక్టివ్ ఫోరమ్‌ను ప్రారంభించనున్నారు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10:ఆయుష్ మంత్రిత్వ శాఖ ఏప్రిల్ 10న విజ్ఞాన్ భవన్‌లో ప్రపంచ హోమియోపతి దినోత్సవం 2026ను నిర్వహించనుంది. ఈ సందర్భంగా అక్కడ రెండు రోజుల ఇంటరాక్టివ్ ఫోరమ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. సుస్థిర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను నిర్మించడంలో హోమియోపతి పోషిస్తున్న అభివృద్ధి చెందుతున్న పాత్రపై చర్చించడానికి ఈ ఇంటరాక్టివ్ ఫోరమ్ ప్రముఖ విధాన రూపకర్తలు, పరిశోధకులు, వైద్యులు మరియు ప్రతినిధులను ఒకచోట చేర్చనుంది.

"సుస్థిర ఆరోగ్యం కోసం హోమియోపతి" అనే ఇతివృత్తంపై కేంద్రీకృతమైన ఈ సంవత్సరం వేడుక, సార్వత్రిక ఆరోగ్య కవరేజ్ మరియు ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ముఖ్యంగా మంచి ఆరోగ్యం మరియు శ్రేయస్సుపై ఎస్‌డిజి 3 వంటి ప్రపంచ ప్రాధాన్యతలకు అనుగుణంగా, హోమియోపతి ఆరోగ్య సంరక్షణకు సంపూర్ణమైన, తక్కువ ఖర్చుతో కూడిన మరియు పర్యావరణ బాధ్యతాయుతమైన విధానాన్ని ఎలా అందిస్తుందో తెలియజేస్తుంది.

ఈ కార్యక్రమానికి ఆయుష్ మంత్రిత్వ శాఖ గౌరవ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) మరియు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్, ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటెచాతో పాటు, దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ ప్రభుత్వ అధికారులు మరియు ప్రముఖ నిపుణులు హాజరు కానున్నారు. సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి (అఅఖీఊ) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ కార్యక్రమం, హోమియోపతి రంగంలోని కీలక పరిశోధన పురోగతులు, ప్రజారోగ్య కార్యక్రమాలు మరియు విధానపరమైన అభివృద్ధిని ప్రదర్శిస్తుంది. ఇందులో శాస్త్రీయ ధ్రువీకరణ, నైతిక ప్రమాణాలను బలోపేతం చేయడం, మరియు హోమియోపతిని ప్రధాన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలలోకి ఏకీకృతం చేయడంపై కూడా చర్చలు జరుగుతాయి. పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, దీర్ఘకాలిక వ్యాధుల భారం, మరియు యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ వంటి ఆందోళనల నేపథ్యంలో, ఈ కార్యక్రమం హోమియోపతిని ఒక సుస్థిర వైద్య వ్యవస్థగా దాని సామర్థ్యాన్ని నొక్కి చెబుతుంది. ఈ వ్యవస్థ కనీస పర్యావరణ ప్రభావం, హేతుబద్ధమైన వనరుల వినియోగం, మరియు శరీరం యొక్క సహజ స్వస్థత యంత్రాంగాలను ఉత్తేజపరచడంపై దృష్టి పెట్టడం వంటి లక్షణాలను కలిగి ఉంటుంది.

నివారణ మరియు ప్రోత్సాహక ఆరోగ్య సంరక్షణలో, జీవనశైలి మరియు దీర్ఘకాలిక వ్యాధుల నిర్వహణలో హోమియోపతి పాత్ర, మరియు సాంప్రదాయ ఔషధ చికిత్సపై ఆధారపడటాన్ని తగ్గించడంలో దాని సహకారాన్ని ప్రత్యేక సమావేశాలు అన్వేషిస్తాయి. పర్యావరణ అనుకూల ఔషధ పద్ధతులు, జీవవైవిధ్య పరిరక్షణ, మరియు సాంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రీయ పరిశోధనతో అనుసంధానించడం యొక్క ప్రాముఖ్యతపై కూడా చర్చలు కేంద్రీకృతమవుతాయి.

గడిచిన సంవత్సరాలుగా, భారతదేశంలో మరియు ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా సామాజిక ఆరోగ్య సంరక్షణ మరియు ప్రజారోగ్య కార్యక్రమాలలో హోమియోపతికి ఆదరణ పెరుగుతోంది. ఆయుష్ మంత్రిత్వ శాఖ, సాక్ష్యాధారిత పద్ధతులు, మెరుగైన అందుబాటు మరియు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో ఏకీకరణ ద్వారా దీని పరిధిని విస్తరించడానికి చురుకుగా కృషి చేస్తోంది.

ప్రపంచ హోమియోపతి దినోత్సవం 2026, సాంప్రదాయ వైద్య విధానాలను ప్రోత్సహించడంలో భారతదేశ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందని, అలాగే పటిష్టమైన, సమ్మిళితమైన మరియు సుస్థిరమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను సృష్టించే ప్రయత్నాలకు నూతన ఊపునిస్తుందని ఆశిస్తున్నారు.

ఈ కార్యక్రమం, భాగస్వాముల మధ్య సంభాషణ, సహకారం మరియు ఆవిష్కరణలను పెంపొందించడానికి ఒక వేదికగా కూడా ఉపయోగపడుతుంది. తద్వారా భవిష్యత్తులో ఆరోగ్య సంరక్షణ కేవలం సమర్థవంతంగానే కాకుండా, సమానంగా, పర్యావరణ స్పృహతో మరియు సుస్థిరంగా ఉండేందుకు మార్గం సుగమం చేస్తుంది.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్

## –చైతన్య మోడల్ హైటెక్ పాఠశాల

పరకాల, ఏప్రిల్ 10:పరకాల పట్టణంలోని చైతన్య మోడల్ హైటెక్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.




శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్, విద్యావేత్త డా. సిరికొండ శ్రీనివాసాచారి, ప్రధానోపాధ్యాయులు వీణవంక రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పరకాల మున్సిపాలిటీ బీజేపీ 12వ వార్డు కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్, 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్ కుమార్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ, క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కార్యక్రమానికి హాజరైన కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్ సుమారు 50 మంది విద్యార్థులకు ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్లను బహుమతిగా అందజేశారు.

# చౌటుప్పల్ లో ఓపెన్ ఫ్లై ఓవర్ ని నిర్మించాలని ఆర్డీవోకు వినతి

చౌటుప్పల్, ఏప్రిల్ 10: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ హైవే విస్తరణలో భాగంగా చౌటుప్పల్ బస్టాండు ఎదురుగా ఓపెన్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని, చౌటుప్పల్ చెరువు అలుగునీరు సాఫీగా వెళ్లే విధంగా హైవేకి రెండవ వైపు ఉన్న అండర్ డ్రైనేజీలోకి పైప్ లైన్ కలపాలని చౌటుప్పల్ పట్టణంలో సిపిఎం నాయకులు శుక్రవారం ప్రదర్శన చేసి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. చెరువు నిండినప్పుడు, చెరువు కట్టకు, కాలనీ వాసులకు, హైవే రోడ్డు పైకి, షాపుల్లోకి, నీరు రావడం జరుగుతుందని, రెండవ వైపు ఉన్న డ్రైనేజీకి పైపులైన్ కలపాలని కోరారు.

హైవే రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తిచేసి, రోడ్డుకు ప్రజలు అటువైపుకు వెళ్లే విధంగా తాత్కాలికంగా వెసులుబాటు కలిగించాలని కోరారు. రోడ్డుకు రెండవ వైపు ప్రభుత్వం ఆసుపత్రి, కూరగాయల మార్కెట్, స్కూల్స్, ఉండడంవల్ల ప్రయాణికులు, ప్రజలు, అటువైపు వెళ్లాలంటే చాలా దూరం నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, రోడ్డు త్వరగా పూర్తిచేసి తాత్కాలికంగా రోడ్డు దాటే ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎండి పాషా, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, నాయకులు బండారు నరసింహ, బత్తుల దాసు, ఆదిమూలం నందీశ్వర్, ఆకుల ధర్మయ్య, కందగట్ల ఆనంద్, కొండే శ్రీశైలం, తొర్పునూరు మల్లేశం, బోయ యాదయ్య, జంగయ్య, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పార్టీ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు ఆధ్వర్యంలో మండలంలోని దండు మల్కాపురం గ్రామంలో సిపిఎం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు.

# 'రామన్నపేట నియోజకవర్గంను పునరుద్ధరించాలి'



నల్గొండ, ఏప్రిల్ 10: గతంలో రద్దయిన రామన్నపేట నియోజకవర్గంను పునరుద్ధరించాలని, నియోజకవర్గాల పునర్విభజనలో రామన్నపేటకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని మండల అఖిలపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. కాంగ్రెస్, సిపిఎం, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో స్థానిక రహదారి బంగళాలో అఖిలపక్ష పార్టీల సమావేశం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి మండలారెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య,కాంగ్రెస్ జిల్లా నాయకుడు గంగుల రాజిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోచబోయిన మల్లేశం మాట్లాడుతూ సుమారుగా 50 సంవత్సరాలు కొనసాగిన రామన్నపేట నియోజకవర్గం 2009వ సంవత్సరంలో రద్దు చేయడంతో 20 సంవత్సరాలు వెనక్కి పోవడం జరిగిందని మండల కేంద్రమైన రామన్నపేటలో డివిజనల్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు అన్ని కూడా అందుబాటులో ఉన్నాయని నియోజకవర్గ కావడానికి ఉన్న సదుపాయాలు ఇప్పటికే ఉన్నాయన్నారు.

నియోజకవర్గాన్ని పునరుద్ధరించడం న్యాయమైన డిమాండ్ అని అన్నారు. ఈ ఎ ో ం ా ట ం ల ో రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని పిలునిచ్చారు. మరో మహా పోరాటానికి గ్రామాల ప్రజలు సన్నద్ధం కావాలని త్వరలో పోరాట కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు కన్నెకంటి వెంకటేశ్వర చారి, టిపిసిసి అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర, సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, బీఆర్ఎస్ మండల బత్తుల వెంకటేశం,బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఏ మజీద్, కార్యదర్శి యాదాసు యాదయ్య, జినుకల ప్రభాకర్,సాల్వేరు అశోక్, కూరెళ్ళ నర్సింహ చారి, ఎండీ జమీరొద్దీన్, గోదాసు పృధ్వీ, నోముల చిరంజీవి, బొడ్డు సురేందర్, తిరుగుడు మల్లికార్జున్, ఎండీ రెహాన్, కందుల హనుమంతు, బోయిని ఆనంద్, బొడ్డు వెంకటేశం పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల సేవలు వెలకట్టలేనివి : జిల్లా సంక్షేమాధికారి రవూఫ్ ఖాన్

ఆదిలాబాద్, ఏప్రిల్ 10: గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ( ఒనిణజీనిలిజీటతి ) టీచర్‌గా, ఆయాలుగా, పలు ఉద్యోగులుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వారి సేవలు వెలకట్టలేమని జిల్లా

సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్ ( ఖీజీనీబీట ఐఫ్ఫ్రజీని) అన్నారు. శుక్రవారం మండలంలోని రేచిని రైతు వేదికలో తాండూర్ సెక్టార్ పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన అంగన్ వాడీ టీచర్లు, ఆయాలకు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

అచ్చలాపూర్– 7 అంగన్‌వాడీ టీచర్ అప్పాల రాధ, పలు ఆంగన్ వాడీ కేంద్రాల ఆయాలు అంకుబాయి, నానక్క బీమక్క, పుల్లమ్మ, లక్ష్మి, రాజుబాయి, మల్లుబాయి లకు బెల్లంపల్లి సీడీపీవో స్వరూపారాణి, అధికారులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి తొలి పాఠశాల అంగన్‌వాడీ కేంద్రమే అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్య అభ్యసించిన తనతో పాటు ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. అనంతరం అన్నప్రాసన, అక్షరభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతురాజుల రాంబాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

# భర్త ఇంటి ముందు భార్య మౌన పోరాటం

నల్గొండ, ఏప్రిల్ 10:కాపురానికి తీసుకెళ్లడం లేదని ఆరోపిస్తూ భర్త ఇంటి ముందు భార్య మౌన పోరాటానికి దిగింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మోతే మండలం ఉర్లుగొండలో జరిగింది. ఉర్లుగొండ గ్రామానికి చెందిన కోళ్ల వీరభద్రం– పద్మ కుమారుడు కోళ్ల సాగర్, ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన సిరికొండ శ్రీలక్ష్మి ఇరువురు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. శ్రీలక్ష్మి ప్రస్తుతం ఐదు నెలల గర్భవతి. అయితే సాగర్ తనను ప్రేమించి పెళ్లి చేసుకుని, గర్భవతిని చేసి కాపురానికి తీసుకుపోవడం లేదని పేర్కొంటూ శ్రీలక్ష్మి శుక్రవారం అత్తింటి ముందు మౌన పోరాటానికి దిగింది. తనకు న్యాయం చేయాలని వేడుకొంటుంది.

# అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ యాదగిరి మృతి

నల్గొండ, ఏప్రిల్ 10: పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే అంగోతు యాదగిరి అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం మృతిచెందాడు. 1992 బ్యాచ్ కు చెందిన ఆయన గత మూడు సంవత్సరాలుగా పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నల్లగొండలోని ఆరోగ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో ఈ ఉదయం చనిపోయాడు. సూర్యాపేటలోని నివాసంలో ఆయన భౌతిక కాయాన్ని డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్, ఎస్ఐ కాస్తల గోపికృష్ణ, పోలీస్ సిబ్బంది సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# "మాతృభాషలో రాజ్యాంగం పౌరులకు సాధికారత కల్పిస్తుంది": ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి. పి. రాధాకృష్ణన్, ఈరోజు ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో, భారత రాజ్యాంగం యొక్క తాజా ప్రతిని సింధీ భాషలో, దేవనాగరి మరియు పర్షియన్ లిపులలో విడుదల చేశారు.

సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఉపరాష్ట్రపతి సింధీ భాషా దినోత్సవ సందర్భంగా సింధీ భాషా సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. సింధీ అత్యంత పురాతనమైన మరియు మధురమైన భాషలలో ఒకటని, దాని సాహిత్య సంప్రదాయం వేదాంత తత్వశాస్త్రం మరియు సూఫీ ఆలోచనల యొక్క విశిష్టమైన సంగమాన్ని ప్రతిబింబిస్తుందని, ఐక్యత, ప్రేమ మరియు సోదరభావం వంటి సార్వత్రిక విలువలను ప్రోత్సహిస్తుందని ఆయన అభివర్ణించారు.

ఈ సందర్భం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారిగా రాజ్యాంగాన్ని సింధీ భాషలో, ముఖ్యంగా దేవనాగరి లిపిలో విడుదల చేయడం భాషా సమ్మిళితత్వాన్ని ప్రోత్సహించడంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం కేవలం ఒక చట్టపరమైన పత్రం మాత్రమే కాదని, అది దేశ ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, హక్కులను పరిరక్షిస్తూ, ప్రజాస్వామ్య పాలనకు మార్గదర్శకంగా నిలిచే దేశ జీవనాడి అని ఆయన నొక్కిచెప్పారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం రాజ్యాంగాన్ని బహుళ భారతీయ భాషలలో అందుబాటులోకి తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాలను ఉపరాష్ట్రపతి అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజలు తమ మాతృభాషలో రాజ్యాంగాన్ని అర్థం చేసుకునేలా చేయడం ద్వారా, పౌరులకు మరియు ప్రభుత్వానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో సహాయపడతాయని, తద్వారా ప్రజాస్వామ్య భాగస్వామ్యాన్ని మరియు విశ్వాసాన్ని బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

తన రాజ్యాంగాన్ని విస్తృత శ్రేణి భాషలలో అందుబాటులోకి తీసుకురావడంలో భారతదేశం ప్రత్యేకంగా నిలుస్తుందని ఆయన గమనించారు. బోడో, డోగ్రీ, సంతాలి, తమిళం, గుజరాతీ మరియు నేపాలీ భాషలలోకి అనువాదాలతో సహా ఇటీవలి సంవత్సరాలలో చేపట్టిన ఇలాంటి కార్యక్రమాలను ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ ప్రయత్నాలు భారతదేశ భాషా వైవిధ్యాన్ని చాటిచెబుతూ, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తాయని ఆయన అన్నారు.

సింధీ సమాజం యొక్క చారిత్రక ప్రస్థానాన్ని స్మరించుకుంటూ, దేశ విభజన అనంతర క్లిష్ట సమయాల్లో ఆ భాష స్థైర్యానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. దాని సాంస్కృతిక ప్రాముఖ్యతను గుర్తించి, భవిష్యత్ తరాల కోసం దాని పరిరక్షణను నిర్ధారించేందుకు, 1967లో 21వ రాజ్యాంగ సవరణ ద్వారా సింధీ భాషను రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చారని ఆయన గుర్తుచేసుకున్నారు.

అన్ని భాషలను గౌరవించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతూ, ప్రతి వ్యక్తి తమ మాతృభాషను ఎంతో ప్రియంగా భావించినప్పటికీ, అన్ని భాషలకు సమాన గౌరవం ఇవ్వాలని ఆయన అన్నారు. భారతదేశ బలం దాని వైవిధ్యంలోనే ఉందని, భాషలు సంస్కృతి, సంప్రదాయం మరియు గుర్తింపునకు కీలకమైన వాహకాలని ఆయన ఉద్ఘాటించారు.

రాజ్యాంగాన్ని ప్రాంతీయ భాషల్లోకి అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్న న్యాయ, న్యాయ మంత్రిత్వ శాఖను, ముఖ్యంగా ప్రాంతీయ భాషా అధికారులను ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలు పౌరులకు సాధికారత కల్పించడానికి, 2047 నాటికి వికసిత భారత్ అనే దార్శనికతను బలోపేతం చేయడానికి దోహదపడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

పౌరులు తమ మాతృభాషలను, అలాగే దేశ సమిష్టి భాషా వారసత్వాన్ని గౌరవించాలని పిలుపునిస్తూ, భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తిని, "దేశమే ప్రథమం ? రాష్ట్ర ప్రథమం" అనే మార్గదర్శక సూత్రాన్ని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి చలువ కళ్లద్దాలు, సమ్మర్ కిట్ల పంపిణీ




నల్గొండ, ఏప్రిల్ 10:సూర్యాపేట, కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి శుక్రవారం జిల్లా ఎస్పీ కె.నరసింహ చలువ కళ్లద్దాలు, సమ్మర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలంలో ట్రాఫిక్ విధులను నిర్వర్తించే ట్రాఫిక్ సిబ్బంది ఎండ వేడిమి నుండి సరైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరి పనితీరు గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రోడ్లపై విధులు నిర్వర్తించేటప్పుడు తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునే విధంగా ఈ కిట్లను అందజేయడం జరిగిందన్నారు.

విధుల పరంగానైనా, వ్యక్తిగతంగానైనా ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఎండ వేడిమి నుండి ఎప్పటికప్పుడు తమను తాము సంరక్షించుకోవాలంటే ఎక్కువగా నీళ్లు త్రాగాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పై నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకై భాద్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరసింహచారి, సీఐలు వెంకటయ్య, శివశంకర్, రిజర్వ్ సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐలు సాయిరాం, పాల్గొన్నారు.

# ఎన్ఎస్పీ కాల్వలో ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 10 : ఈత సరదా ఒక విద్యార్థి ప్రాణాల మీదకు తెచ్చిన సంఘటన శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం గ్రామానికి చెందిన పదో తరగతి పరీక్షలు రాస్తున్న ఐదుగురు విద్యార్థులు స్నేహితుడు పుట్టినంరోజు పురస్కరించుకుని గ్రామ సమీపంలోని గొల్లగూడెం సమీపంలోని ఎన్ఎస్పి కాల్వలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈతకు వెళ్లిన ఐదుగురు స్నేహితుల్లో పుట్టబంతి రామకృష్ణ అనే యువకుడు గల్లంతయ్యాడు. ఉమేష్, వరుణ్ సందేశ్, సందీప్, బాలాజీతో కలిసి ఈతకు వెళ్లిన రామకృష్ణకు ఈత రాకపోవడంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు.

# ముప్పారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నల్గొండ, ఏప్రిల్ 10: ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని ముప్పారం గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం విక్రయాల్లో రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించాలని కోరారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మునికృష్ణయ్య, ఏపీఎం నరహరి, నాయకులు కొండ శ్రీనివాస్ రెడ్డి, మేరెడ్డి వెంకటరమణ, ఆలంపల్లి మైసయ్య, కంచి పాపయ్య, గుదెగోపు లక్ష్మారెడ్డి, భాస్కరి నారాయణ, సీసీలు నరసింహ చారి, తంగమణి పాల్గొన్నారు.

# "మౌలిక సదుపాయాలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు మరియు పరిశోధనల ద్వారా ప్రభుత్వం ఆయుష్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తోంది" - వైద్య రాజేష్ కోటెచా

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10 :ఆయుష్ మంత్రిత్వ శాఖ, "సుస్థిర ఆరోగ్యం కోసం హోమియోపతి" అనే ఇతివృత్తంతో ప్రపంచ హోమియోపతి దినోత్సవం 2026ను న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఘనంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న విధాన రూపకర్తలు, పరిశోధకులు, వైద్యులు, విద్యావేత్తలు మరియు విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం డాక్టర్ శామ్యూల్ హానిమాన్ జయంతిని పురస్కరించుకుని, సమ్మిళిత మరియు సుస్థిర ఆరోగ్య సంరక్షణను అభివృద్ధి చేయడంలో హోమియోపతి యొక్క విస్తరిస్తున్న పాత్రను నొక్కి చెప్పింది.

ఈ సందర్భంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అయిన శ్రీ ప్రతాపరావు జాదవ్ మాట్లాడుతూ, "సంవత్సరాలుగా, పటిష్టమైన సంస్థలు మరియు పరిశోధనా సంస్థల మద్దతుతో భారతదేశం ఒక బలమైన మరియు విస్తరిస్తున్న హోమియోపతి వైద్య బృందాన్ని అభివృద్ధి చేసింది. సంస్థలు పరిశోధన, విద్య మరియు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందించడం ద్వారా హోమియోపతిలో శాస్త్రీయ పునాదిని, నియంత్రణ చట్రాన్ని మరియు ప్రజల విశ్వాసాన్ని నిరంతరం బలోపేతం చేస్తున్నాయి. తద్వారా దేశవ్యాప్తంగా అందరికీ అందుబాటులో ఉండే మరియు సరసమైన ఆరోగ్య సంరక్షణకు ఇవి అర్థవంతంగా దోహదపడుతున్నాయి" అని అన్నారు.

హోమియోపతిని ఒక విశ్వసనీయమైన మరియు ప్రపంచవ్యాప్తంగా ప్రాసంగికమైన వైద్య విధానంగా మరింత బలోపేతం చేయడానికి, సాక్ష్యాధారిత పురోగతి, వివిధ రంగాల మధ్య సహకారం మరియు నిరంతర పరిశోధనలు అత్యవసరం అని శ్రీ జాదవ్ నొక్కి చెప్పారు. ఉన్నత నాణ్యత గల, రోగి-కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణను అందించడానికి, శాస్త్రీయ అధ్యయనాలను పెంపొందించడం, విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, మరియు వైద్యులు, పరిశోధకులు, విధాన రూపకర్తల మధ్య బలమైన సమన్వయాన్ని పెంపొందించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు. జాతీయ ప్రాధాన్యతలు మరియు ప్రపంచ ఆరోగ్య లక్ష్యాలకు అనుగుణంగా, సంపూర్ణ మరియు సుస్థిరమైన ఆరోగ్య సంరక్షణ నమూనాను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కోటెచా మాట్లాడుతూ, సాక్ష్యాధారిత ఆరోగ్య సంరక్షణ అందించడానికి మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు, సేవల విస్తరణ, మరియు ఆయుష్ గ్రిడ్, హెచ్ఎంఐఎస్ వంటి డిజిటల్ వేదికల ద్వారా ప్రభుత్వం ఆయుష్ వ్యవస్థను బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన మరియు భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని నిర్మించడానికి విద్య మరియు శిక్షణ వ్యవస్థలను ఆధునీకరించే ప్రయత్నాలను కూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. బలమైన సంస్థాగత నెట్‌వర్క్‌లు, పరిశోధన మరియు ప్రామాణీకరణపై పెరుగుతున్న ప్రాధాన్యతతో, అందుబాటులో మరియు సుస్థిరమైన ఆరోగ్య సంరక్షణకు దోహదపడుతూ, భారతదేశం హోమియోపతిలో ప్రపంచ అగ్రగామిగా ఆవిర్భవించిందని శ్రీ కోటెచా మరింతగా నొక్కి చెప్పారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి అలర్మేల్మంగై డి., సంస్థాగత వృద్ధి, ప్రామాణీకరణ మరియు ప్రపంచవ్యాప్త విస్తరణపై గట్టి దృష్టి సారించడంతో, భారతదేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో హోమియోపతి కీలక పాత్ర పోషిస్తూనే ఉందని నొక్కి చెప్పారు. హోమియోపతి వైద్యుల జాతీయ రిజిస్టర్ వంటి కార్యక్రమాలు పారదర్శకతను పెంచుతూ, వృత్తిపరమైన వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని, అదే సమయంలో విద్యా సంస్థలు మరియు వైద్యుల విస్తరిస్తున్న నెట్‌వర్క్ ఈ వ్యవస్థకు పెరుగుతున్న ఆమోదాన్ని ప్రతిబింబిస్తోందని ఆమె పేర్కొన్నారు. సురక్షితమైన, విశ్వసనీయమైన మరియు సమర్థవంతమైన రోగి సంరక్షణను నిర్ధారించడానికి, ఈ విస్తరణను క్లినికల్ శిక్షణ మరియు ఔషధ నాణ్యతలో ఉన్నత ప్రమాణాలతో అనుసంధానించాల్సిన అవసరాన్ని ఆమె మరింతగా నొక్కి చెప్పారు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ సలహాదారు (హోమియోపతి) డాక్టర్ ప్రీత కిళక్కుటిల్ మాట్లాడుతూ, హోమియోపతి ఆరోగ్య సంరక్షణకు రోగి-కేంద్రీకృత మరియు తక్కువ ఖర్చుతో కూడిన విధానాన్ని అందిస్తుందని, నివారణ మరియు దీర్ఘకాలిక వ్యాధుల నిర్వహణలో దీనికి గణనీయమైన సామర్థ్యం ఉందని అన్నారు. మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమాలు అందుబాటును మరియు ఏకీకరణను మెరుగుపరుస్తున్నాయని, అదే సమయంలో విద్య, పరిశోధన మరియు నైతిక పద్ధతులపై నిరంతర దృష్టి వ్యవస్థ యొక్క విశ్వసనీయతను మరియు విస్తరణను బలోపేతం చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

# ఎవరి ప్రాణాలకు హాని కలిగినా యాజమాన్యంపై చర్యలు

## -నాస్ ఫార్మాసిటికల్ అగ్ని ప్రమాదంపై విచారణకు ప్రభుత్వ విప్ వేముల వీరేశం, కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశం

## - క్షేత్రస్థాయిలో పరిశ్రమ పరిశీలన

నల్లగొండ, ఏప్రిల్ 10 : చిట్యాల ప్రాంతంలో ఉండే పరిశ్రమలు చుట్టుపక్కల ప్రజలు, కార్మికులు కాలుష్యం బారిన పడకుండా చూడడంతో పాటు వారి ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఉందని, ఎవరి ప్రాణాలకు హాని కలిగినా యాజమాన్యంపై చర్యలు ఉంటాయని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ హెచ్చరించారు. ప్రత్యేకించి పరిశ్రమలో పనిచేసే ఉద్యోగుల భద్రత చూసుకోవాల్సిన బాధ్యత పూర్తిగా యాజమాన్యంపై ఉందని, అలాగే పర్యావరణాన్ని సైతం ఎప్పటికప్పుడు కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు సమీపం లోని నాస్ ఫార్మాసిటికల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో గురువారం రాత్రి రియాక్టర్ వద్ద సంభవించిన అగ్ని ప్రమాదంలో ఉద్యోగులు వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ కుమార్ గాయపడ్డారు. వీరిని హైదరాబాద్ లోని డిఆర్డిఓ అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమను జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రభుత్వ విప్ వీరేశం శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అగ్నిమాపక శాఖ, స్థానికర



తాసిల్దార్, ఎంపీడీఓ ప్రమాద సంఘటనపై తక్షణమే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అంతేకాక నాస్ కంపెనీకి ఉన్న అనుమతులపై నివేదిక ఇవ్వాలని, ఉద్యోగుల భద్రత పట్ల తీసుకున్న చర్యలపై పోలీసులు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ.. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆస్పత్రి వారితో మాట్లాడడం జరుగుతున్నదని, అంతేకాక పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన ఉద్యోగుల కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కంపెనీ తరఫున అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కంపెనీ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, చిట్యాల తాసీల్దార్ విజయ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 'ఆర్టిజన్ ఉద్యోగులకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలి'

## – దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

నల్గొండ, ఏప్రిల్ 10:విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగులకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కొండమల్లేపల్లి పట్టణంలో కరెంట్ డీఈ కార్యాలయం వద్ద నిర్వహించిన విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగుల సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపడుతూ విద్యుత్ శాఖలోని ఆర్టిజన్ ఉద్యోగుల న్యాయమైన కోరికలను తీర్చాలన్నారు. 2026 వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన యూనిఫామ్‌లు అందించాలి

నల్గొండ, ఏప్రిల్ 10: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే ఉచిత యూనిఫాంల కుట్టు విషయంలో పూర్తి నాణ్యత పాటించాలని టీఎస్‌యూటీఎఫ్ (ఝుఈ) నల్లగొండ జిల్లా కార్యదర్శులు గేర నర్సింహ, నలపరాజు వెంకన్న అన్నారు. ఈ మేరకు శుక్రవారం మునుగోడు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.



## నాణ్యత లేని కుట్టు

గత ఏడాది మహిళా సమాఖ్యల ద్వారా కుట్టించిన యూనిఫాంలు నాణ్యత లోపంతో ఉన్నాయని, విద్యార్థుల శరీర కొలతలకు ఏమాత్రం సంబంధం లేకుండా ఉండటం వల్ల అవి వృథా అవుతున్నాయని ఆరోపించారు. సింగిల్ స్టిచ్చింగ్ చేయడం వల్ల నెల రోజులకే కుట్లు ఊడిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

## కుట్టు ఛార్జీల పెంపు

ప్రస్తుత స్టిచ్చింగ్ ఛార్జీలు చాలా తక్కువగా ఉండటం వల్ల టైలర్లు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నారని, అందుకే ప్రస్తుతం ఇస్తున్న జతకు 75 రూపాయల బదులు అదనంగా జతకు 150 రూపాయల చొప్పున కుట్టు ఛార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

మునుగోడు నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఉన్న 134 పాఠశాలల్లో దాదాపు 7,700 మంది విద్యార్థులు బడుగు, బలహీన, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు మేలు జరిగేలా మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్పందిస్తూ వెంటనే విద్యాధికారులతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన దుస్తులు కుట్టుటలో నాణ్యత పాటించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బిక్కుమల్ల రాములు, ప్రధాన కార్యదర్శి పెరిక నరసింహ, ఉపాధ్యక్షుడు కూన్‌రెడ్డి సుధాకర్ రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

# చిరుత సంచారం.. భయాందోళనలో గ్రామస్థులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10: జిల్లాలో మూడు నెలలుగా కలవరపెడుతున్న చిరుత సంచారం సీసీ ఫుటేజ్‌లో జాడ తెలిసింది . జిల్లాలోని మల్దకల్ మండలంలో చిరుత సంచరిస్తున్నట్లు ఫారెస్టు అధికారులు గుర్తించారు. మండలంలోని పలు గ్రామాల్లో మూగ జీవాలపై గుర్తు తెలియని జంతువు దాడి చేసి చంపేస్తుంది. దీనిపై ఆందోళన చెందిన రైతులు జిల్లా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

తాజాగా నేతువానిపల్లి గ్రామంలో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు అనుమానించడంతోచిరుత కదలికలను గమనించేందుకు అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు అటవీశాఖ అధికారులు గురువారం నేతువానిపల్లి అటవీ ప్రదేశంలో ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చనిపోయిన ఓ మూగ జీవిని అటవీలో వేసి సీసీ కెమెరాల నిఘాలో పర్యవేక్షించారు. మూగజీవిని చిరుత పులి దాడి చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఇప్పటి వరకు గ్రామ శివారులో 8 జంతువులు చిరుత దాడిలో మృతి చెందాయి.

చిరుతను బంధించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడ ఎప్పుడు ఏవిధంగా దాడిచేస్తుందోనంటూ స్థానికులు ప్రతి నిత్యం భయంతో బెంబెలెత్తిపోతున్నారు. శుక్రవారం అటవీప్రాంతంలో అధికారులు పర్యటించి మరోసారి చిరుత కదలికలపై నిఘా పెట్టారు.

# నేరేడుచర్లలో అంతరాష్ట్ర ధాన్యం లారీల తనిఖీ



నల్గొండ, ఏప్రిల్ 10: నేరేడుచర్లలో పౌర సరఫరాల శాఖ అధికారులు శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పోలీసులతో కలిసి అంతర్రాష్ట్ర ధాన్యం లారీలను తనిఖీ చేశారు. ధాన్యం సేకరణ ప్రారంభమై వడ్లు మిల్లులకు రవాణా అవుతున్న సందర్భంగా ఆంధ్రా నుండి ధాన్యం లారీలు తెలంగాణలోకి రాకుండా ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ధాన్యం ఎక్కడి నుండి వస్తోంది.. ఏ మిల్లులలు వెళ్తోంది, రైతు పేరు వంటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసీల్దార్ మాచన రఘునందన్, ఆర్.సైదులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి

ఆదిలాబాద్, ఏప్రిల్ 10:రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎన్నిల అనిల్ ఆరోపించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కుభీర్ తహసీల్దార్ శివరాజ్ కు మొక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంట చేతికొచ్చి దాదాపు నెలరోజులు గడిచిపోతున్నప్పటికీ నేటికీ కేంద్రాలు తెరవకపోవడం విడ్డూరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మక్క రైతులు ప్రైవేట్‌లో రూ. 1700 క్వింటాలు అమ్ముకొని ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోయా, కందులు, శనగలు రైతుకు చేతికి వచ్చిన సమయంలోనూ ప్రభుత్వం ఇదే నాటకం ఆడిందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి 24 గంటలు వ్యవసాయ విద్యుత్, రైతుబంధు, రైతులకు వ్యవసాయ భీమా సౌకర్యం, రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేసిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు పుప్పాల పీరాజీ, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు మొహియుద్దీన్, సాప పోతన్న, పోగుల పోతన్న, పోగుల లింగన్న, దత్తాత్రి, కాశీనాథ్, నాగేష్, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీడిత జన బాంధవుడు జ్యోతి రావు పూలే

## ఏప్రిల్ 11... మహాత్మా పూలే జయంతి



**జ్యోతిరావు పూలే భారత ప్రప్రథమ సామాజిక తత్వవేత్త. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న ప్రజలకు ఆత్మస్థైర్యం అందించేందుకు, వారి హక్కుల కోసం, నిరం తరం అనుకూల పరిస్థితులలో పోరాటా లు చేసి సత్య ధర్మ శోధక మండలిని స్థాపించి, పలు సమస్యల పరిష్కారానికి కృషిచేసిన మహనీయుడు పూలే.**

భారత జాతిపిత మోహన్ దాస్ గాంధీ కన్నా ముందే "మహాత్మునిగా" భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ చే, "గురువుగా" భావింప బడి, ప్రకటింప బడి, జన నీరాజనాలు అందుకున్న జ్యోతిరావు పూలే భారత ప్రప్రథమ సామాజిక తత్వవేత్త. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న ప్రజలకు ఆత్మస్థైర్యం అందించేందుకు, వారి హక్కుల కోసం, నిరంతరం అనుకూల పరిస్థితులలో పోరాటాలు చేసి సత్య ధర్మ శోధక మండలిని స్థాపించి, పలు సమస్యల పరిష్కారానికి కృషిచేసిన మహనీయుడు పూలే. సామాజిక తత్వవేత్తగా, ఉద్యమకారునిగా, సంస్కరణ వాదిగా, సాంఘిక సేవా తత్పరునిగా, బాలికా విద్య ప్రోత్సాహకునిగా, మహిళా హక్కుల పరిరక్షకునిగా, కార్మిక పక్షపాతిగా, దీన జన బాంధవునిగా, లింగ వివక్షకు వ్యతిరేకిగా అణగదొక్కబడిన వర్గాల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారు పూలే. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్ర (బ్రిటిష్ ఇండియా)లో జన్మించిన పూలే. తండ్రి గోవిందరావు పీష్వాల కాలంలో పూల వ్యాపారం చేయడం వల్ల వారికి పూలే అని పేరు వచ్చింది. చిన్నతనంలో చదువు మానేసి, తిరిగి పుణేలో 1941లో క్రైస్తవ ముస్లిం మిత్రుల సహకారంతో , స్కాటిష్ మిషన్ లో చేరి విద్యాభ్యాసం కొనసాగించారు. పుస్తకపఠనం పై మక్కువ ఎక్కువ చూపారు. చదువుకునే సమయాన 1948 లో బ్రాహ్మణ స్నేహితుని వివాహానికి హాజరైన సందర్భంగా బిసి "మాలి" కులానికి చెందిన పూలే కుల వివక్ష కు లోనై తీవ్ర మానసిక వ్యధ చెందారు. సదాశివ బిల్లాల్ గోవింద్ అనే బ్రాహ్మణ మిత్ర పరిచయం, సాన్నిహిత్యం, "థా మస్" రచన మానవ హక్కుల ప్రభావం, ఆయనపై ఎంతగానో ప్రభావం చూపింది. కులం, వర్గం, ప్రాంతం, లింగాది, వివక్షతలకు అవిద్యే కారణమని భావించి, తన భార్య సావిత్రిని బడికి పంపా రాయన. 1848 ఆగస్టులో బాలికల పాఠశాలను 51--52 లో మరో రెండు పాఠశాలలను ఆదర్శ దంపతులు స్థాపించారు. 1853లో దేశంలోనే మొదటిదిగా పూలే వితంతువుల అనాథ శిశువుల కోసం సేవా సదనం స్థాపించారు. శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి'ని స్థాపించారు. 1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించి, వితంతువులైన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచారు. 1868లో తన ఇంటి దగ్గరున్న స్నానాల తొట్టి వద్ద స్నానం చేసేందుకు అంటరాని వారికి కూడా అనుమతి ఇచ్చారు. బాల హత్య ప్రతిబంధక్ గృహలో జన్మించిన బ్రాహ్మణ వితంతు కుమారున్ని 1872 లో దత్తత స్వీకరించారు. తాను అనుభవించిన కుల వివక్ష ఇతరులకు అనుభవానికి రాకూడదని ఆకాంక్షించారు. సహ ధర్మ చారిణి సావిత్రి తో కలిసి 40 ఏళ్ల పాటు నిర్వహించిన సామాజిక ఉద్యమాలు, పూలే దంపతులకు పేద జనోద్ధారకులుగా సమాజంలో గుర్తింపు తెచ్చాయి. ఎక్కడ అన్యాయం, వివక్ష చోటు చేసుకుంటే, అక్కడ ఉద్యమం నడిపారు. అణగారిన వర్గాలకే కాదు, బాధితులైన అగ్రకుల వితంతు పునర్వివాహాలకు విశేష కృషి సలిపారు. బ్రాహ్మణ వితంతువులకు శిరో ముండనాలు చేయమని క్షురకులచే సమ్మెలు చేయించారు. 1871 లో సత్యశోధన పక్షాన దీనబంధు పత్రిక నడిపాడు. సహపంక్తి భోజనానికి సంసిద్ధత ప్రకటించారు. 1873 సెప్టెంబరు 24న సత్య శోధక సమాజాన్ని పూలే స్థాపించాడు. దేశంలోనే ఇది మొట్టమొదటి సంస్కరణోద్యమం. బొంబాయి నిర్మాణానికి తెలంగాణ నుండి వలస వెళ్ళి ఎదిగిన మున్నూరుకాపులే అధికం. బొంబాయిలో సత్యశోధక్ సమాజ్ శాఖ పుట్టింది సయాజీ నాగు మున్నూరు కాపు ఇంటిలోనే. పూలే సామాజిక సంస్కరణోద్యమానికి తుదిశ్వాస వరకు చేదోడు వాదోడై నిలిచిన జాయా కారాడీ లింగు తెలంగాణం కన్న మున్నూరు కాపు బిడ్డ. కారాడి లింగు తండ్రి జాయా ఎల్లప్పలింగు ముంబైలో భవన నిర్మాణ కాంట్రాక్టరు. పూలే కొంతకాలం భవన నిర్మాణ కాంట్రాక్టరుగా పనిచేశారు. అప్పుడే ఆయనకు ముంబై తెలుగు ప్రజల పితామహునిగా ప్రసిద్ధులైన కాంట్రాక్టరు రామయ్య వెంకయ్య అయ్యవారితో పరిచయమైంది. వెంకయ్య పూలేను ముంబైకి ఆహ్వానించి, తోటి కాంట్రాక్టర్లతో కలిసి సత్యశోధక సమాజాన్ని విస్తరింప జేయడానికి, పాఠశాలలను ఏర్పాటుచేసి నడపడానికి ఆర్థిక, హార్థిక సహాయాలను అందించారు. సత్యశోధక సమాజానికి తెలుగు వారి విరాళాలే ప్రధాన ఆర్థిక వనరుగా ఉండేవి. వెంకయ్య ఇల్లే అనాథ బాలల ఆశ్రమంగా ఉండేది. వారిని గొప్ప విద్యా వంతులుగా, సత్యశోధకులుగా చేసిన ఘనత వెంకయ్యదే. పూలే ప్రసిద్ధ గ్రంథం "గులాంగిరి" పుస్తక ప్రచురణ 1873లో వెంకయ్యనే ప్రచురించారు.

1882లో హంటర్ కమిషన్‌కు' శూద్రాతి శూద్రులకు చదువు చెప్పించాల్సిన అవసరం ఉందని నివేదికలిచ్చి, అస్పృశ్యుల కోసం బ్రిటిష్ వారిచే పాఠశాలల్ని ఏర్పాటు చేయించారు. 83 లో కల్టివేటర్ విప్ కార్డ్ ( సేద్య గాడిపై చర్నాకోల) ముప్పై మూడు వ్యాసాల పుస్తకాన్ని సార్వజనిక సత్య ధర్మ పేరున ప్రచురించారు. బ్రాహ్మణేతరులచే జరిపించిన కులాంతర వివాహాలు చెల్లవని బ్రాహ్మణులు తీర్మానాలు చేస్తే, సత్యశోధన మండలి ద్వారా కోర్టుకు వెళ్లారు. 1990లో కోర్టు పూలే వాదనను సమర్థించింది. తద్వారా పూలే అమితానందం చెందారు. ఆయన వ్రాసిన 33 ఆర్టికల్స్ గల "సార్వజనిక్ సత్యధర్మ" పుస్తకంలో కుటుంబ సృష్టి నియమాల గురించి వివరిస్తూ ప్రపంచం మొత్తాన్ని ఒక కుటుంబంగా వ్యక్తీకరించారు. సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డా బి.ఆర్. అంబేద్కర్ ప్రకటించారు. పూలేకు కేవలం కుల వ్యవస్థ వ్యతిరేకతే కాదు, సామ్రాజ్యవాద వ్యతిరేకత, కార్మికవర్గ, రైతాంగ పక్షంగా పోరాడే అవగాహన, కార్యాచరణ ఉన్నాయి. అనారోగ్యానికి గురై పడకకే పరిమితం అయిన సమయాన, తాను మృతి చెందాక, ఎవరు ఏ బాధ్యతలు స్వీకరించాలో వివరించి సామాజిక ఉద్యమాలు, విస్తరింపచేసి, ప్రగతి మార్గంలో ప్రజలను తీసుకెళ్లాలని నొక్కి చెప్పి, తన ఆదర్శాలను కొనసాగించాలని హితవు పలికి 63వ ఏట 1890 నవంబర్ 28న గురువారం రాత్రి ప్రార్థనా గీతాల మధ్య దీర్ఘ నిద్రకు మహాత్మ పూలే ఉపక్రమించారు. భారతావనిలో గొప్ప సాంఘిక సంస్కర్తగా ఆచంద్ర తారార్కం మహాత్మ పూలే మిగిలి పోనున్నారు.



**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
9440595494

---

## ఘనంగా శ్రీ యజ్ఞ వరాహ స్వామి హిందూ సమ్మేళనం...



కరీంనగర్, ఏప్రిల్ 10:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీ, గాయత్రి నగర్ బస్తి ల హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. శ్రీ యజ్ఞ వరాహస్వామి హిందూ సమ్మేళనం పేరిట నిర్వహించిన ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులు, వక్తలుగా సి ఎచోళ్ళేటిరమేష్( అధ్యక్షులు) ,అన్నదానం సుబ్రహ్మణ్యం ,శ్రీ శ్రీ శ్రీ ఆత్మరాం సురేష్ మహారాజ్ , డాక్టర్ నీలిమ జిల్లా సంఘ్ చాలాక్ నిరంజనచారి లు హాజరై మాట్లాడారు. సమాజంలో కులాల పేరుతో విభజన పెరుగుతున్న నేపథ్యంలో హిందువులు ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. విదేశీ ప్రభావాలను ఎదుర్కొనేందుకు సమాజంలో ఐక్యత అత్యంత అవసరమని , అదిశగా హిందువులంతా ఐక్యమత్యంతో ఉండాలన్నారు. హిందూ సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళనాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సమ్మేళనంలో హౌసింగ్ బోర్డ్, గాయత్రి నగర్ ప్రజలు, విద్యార్థి విద్యార్థులు 720 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వేములవాడలో మెగా హీరో సాయి ధర్మ తేజ్ ప్రత్యేక పూజలు

### – భీమేశ్వరస్వామి దర్శనం, కోడె మొక్కులు చెల్లింపు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 10:(నేటినిజం ప్రతినిధి): దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వ రస్వామి వారి ఆలయానికి అనుబంధమైన భీమేశ్వరస్వామివారిని శుక్రవారం మెగా హీరో సాయి ధర్మ తేజ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వేద పండితులు ఆలయ సంప్రదాయ ప్రకారం శాస్త్రి వచనాలతో స్వాగతం పలికారు. ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం సాయి ధర్మ తేజ్ మాట్లాడుతూ స్వామివారి దర్శనం ఎంతో బాగా జరిగిందని, చాలా ఆనందంగా ఉందని తెలిపారు. తాను తొలిసారిగా వేములవాడకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ఉన్నారు.

## ఆడపిల్లలకు జన్మనిస్తుందని భార్య, ఇద్దరు కూతుళ్లను హత్య చేసిన భర్త!!

వరంగల్, ఏప్రిల్ 10: మరోసారి భార్యకు ఆడపిల్ల జన్మనిస్తుందన్న సమాచారంతో భార్యను, మరో ఇద్దరు కూతుళ్లను హత్యచేసిన భర్తను, ఆయనకు సహకరించిన మరో 9 మందిని వరంగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 1న వరంగల్ పోలీసు కషనరేట్ పరిధిలోని ఐనవోలు మండలం , పున్నెలు గ్రామం స్విమింగ్ పూల్‌లో హత్యకు గురైన భార్య, ఇద్దరు ఆడపిల్లలు సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలంగా మారింది.

ఈ ఘటనకు సంబంధించిన వివరాలనఉ హనుమకొండలోని సీపీ కార్యాలయంలో పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

పున్నెలు గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు అజారుద్దీన్ తన భార్య ఫరహాత్ గర్భం దాల్చడం తో ఇటీవల కుటుంభ సభ్యులు కలిసి, ఇద్దరుమహిళ వైద్యులు లింగ నిర్ధారణ చేయడంతో, మళ్లీ ఆడపిల్ల అని తేలింది.

ఇదే సమయంలో ప్రధాన నిందితుడు అజారుద్దీన్ దూరపు మైనర్ బాలిక పై కన్నేసి, ప్రేమిస్తున్నానని , పెళ్లి చేసుకుంటాను కోరాడు. అయితే ఆమె నీకు ఇప్పటికే పెళ్లయింది. ఇద్దరు పిల్లలు ఉన్నారనిని పెళ్లికి నిరాకరించింది. భార్య, ఆడపిల్లలు ఉన్నందునే దూరపు బాలిక పెళ్లికి అంగీకరించడం లేదని కక్షతో ఈనెల 1న రాత్రి ఐస్ క్రీమ్ తినిపిస్తానని భార్య, ఇద్దరు పిల్లలను నమ్మించి కారులో ఫున్నెలులో అతను నిర్వహిస్తున్న స్విమింగ్ పూల్‌కు తీసుకెళ్లాడు.

## ప్రతిమ ఫౌండేషన్ మెగా వైద్య శిబిరం

### – ప్రజల నుండి విశేష స్పందన



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 10:(నేటినిజం ప్రతినిధి): ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ వేములవాడలో నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. వేములవాడ లయన్స్ క్లబ్, మాతృశ్రీ హాస్పిటల్ డాక్టర్ చికోటి సంతోష్ కుమార్ సౌజన్యంతో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్నూరు కాపు సత్రంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్ విజయవంతమైంది. ఈ శిబిరంలో అన్ని వైద్య విభాగాల నిపుణులు పాల్గొని సేవలు అందించగా, సుమారు 563 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అత్యవసర చికిత్స అవసరమైన 52 మందిని ప్రతిమ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా డా. చెన్నమనేని వికాస్, డా. దీప మాట్లాడుతూ సమాజ సేవే తమ ధ్యేయమని, ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల లోటును తగ్గించేందుకు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డా. శోభారాణి, బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ రాపెల్లి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్, టౌన్ కౌన్సిలర్లు, నాయకులు, ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్యులు, టెక్నీషియన్లు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్తరప్రదేశ్‌లోని మధురలో పడవ ప్రమాదంపై ప్రధానమంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10:ఉత్తరప్రదేశ్‌లోని మధురలో పడవ బోల్తా పడటంతో జరిగిన విషాదకరమైన ప్రాణనష్టం పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

ఈ దురదృష్టకర ప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రధానమంత్రి తన హృదయపూర్వక సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని తాను ప్రార్థిస్తున్నానని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ విషాదంతో ప్రభావితమైన వారికి స్థానిక యంత్రాంగం అన్ని విధాలా చురుకుగా సహాయం అందిస్తోందని ప్రధానమంత్రి తెలిపారు.

"ఉత్తరప్రదేశ్‌లోని మధురలో పడవ బోల్తా పడటం వల్ల జరిగిన దుర్ఘటన పట్ల తీవ్రంగా బాధపడ్డాను. తమ ఆత్మీయులను కోల్పోయిన వారికి నా సంతాపం. నేను ప్రార్థిస్తున్నాను..."

## వేసవి సెలవుల్లో యువత జాగ్రత్త : ఎస్ఐ మేడా ప్రసాద్

ఖమ్మం, ఏప్రిల్ 10: వేసవి సెలవుల్లో యువత జాగ్రత్తగా ఉండాలని బూర్గంపహాడ్ ఎస్ఐ మేడా ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో చెరువులు, వాగులు, కిన్నెరసాని, గోదావరి తదితర ప్రాంతాల్లో ఈతకు వెళితే యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరి, కిన్నెరసాని ప్రాంతాల్లో యువత స్నానం చేద్దామని దిగితే లోతు తెలియకుండా నీటిలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వారంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సెలవు సమయాల్లో చెరువులు, కుంటల వైపు వెళ్లనీయకుండా పర్యవేక్షణ చేయాలని, వేసవి సెలవు సమయాల్లో క్రీడలు, డ్రాయింగ్ తదితర వాటిపై నైపుణ్యత ప్రదర్శించాలని, ఆ విధంగా తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

## నూతన దంపతులకు కౌన్సిలర్ జ్యోతి తిరుపతిరెడ్డి కానుక

### – ప్రతి ఆడబిడ్డ పెళ్లికి రూ.10,016 ప్రకటన



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 10:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన వివాహ వేడుకలో 2వ వార్డు కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతిరెడ్డి నూతన దంపతులకు పెళ్లికానుకగా రూ.10,016 అందజేశారు. గడ్డం అంతగిరి–రాజేశ్వరి దంపతుల కుమార్తె అఖిల వివాహానికి హాజరైన ఆమె, నూతన వధూవరులను ఆశీర్వదించి నగదు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో జరిగే ప్రతి ఆడబిడ్డ వివాహానికి రూ.10,016 చొప్పున అందజేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుడిసె శంకర్, మెట్ట దేవానంద్, గుడిసె సదానందం, రేగుల రాజేశం, భూపేందర్ రెడ్డి, చల్ల చంద్రయ్య, గుడిసె నాగరాజు, గుడిసె దాసు, సుద్దాల బాలయ్య, మల్లారపు తిరుపతి, వికృర్తి సాయి, సందరగిరి ప్రకాశ్, బావండ్ల శ్రీనివాస్, లింగంపల్లి అంజయ్య, గుండు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మినా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో హజ్ యాత్రికుల కోసం గ్రాండ్ ఫ్రీ హెల్త్ క్యాంప్

హైదరాబాద్, ఏప్రిల్ 10:: హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని మినా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత హెల్త్ క్యాంప్‌ను తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్‌సీ) చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ప్రారంభించారు. ఈ హెల్త్ క్యాంప్ ఏప్రిల్ 10, 11వ తేదీల్లో కొనసాగుతుంది.అతిబిఎ ఢ ఒనీఇజీశ్రీ ఉబీతిటవబ

ఈ సందర్భంగా యాత్రికులకు జనరల్ హెల్త్ చెకప్‌తో పాటు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మెడికల్ కిట్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి ముందస్తు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్‌సీ) చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ.. కరోనా కాలంలోనూ మినా ఆస్పత్రి విశేష సేవలు అందించిందని, మైనారిటీలకే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిగా మినా ఆస్పత్రి మంచి పేరు సంపాదించిందన్నారు. హజ్ యాత్రికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మెడికల్ కిట్లు అందించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. మినా ఆస్పత్రి ఆధునిక సదుపాయాలతో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, మేటర్నిటీ, ఎమర్జెన్సీ, ట్రామా కేర్, ఐసీయూ వంటి విభాగాల్లో సమర్థవంతమైన సేవలు అందిస్తున్నదని ప్రశంసించారు.

ఆస్పత్రి చైర్మన్ హైదయతుల్లా ఖాన్ ఆధ్వర్యంలో రోగులకు అందుబాటు ఖర్చులో మెరుగైన చికిత్స అందిస్తున్నారని, ఆప్తాల్మాలజీ (ఐ కేర్) విభాగంలో డాక్టర్ హిదయతుల్లా ఖాన్, డాక్టర్ బాసిత్ హుస్సేన్, గైనకాలజీ విభాగంలో డాక్టర్ సోహెబా షకూర్, జనరల్ మెడిసిన్ విభాగంలో డాక్టర్ జవాద్ విశేష సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

## 'మున్సిపల్ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి'

### – ఈఎంసీ కమిషనర్‌కు ఏఐటీయూసీ వినతి

ఖమ్మం ఏప్రిల్ 10 : ఏదులాపురం మున్సిపాలిటీలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు రూ.750 పోస్టల్ ప్రమాద బీమాను మున్సిపాలిటీ నుండే కట్టించాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదులాపురం మున్సిపాలిటీలో ఇటీవల కృష్ణ అనే ఎలక్ట్రీషన్ స్తంభం మీద నుండి ప్రమాదవశాత్తు కిందపడ్డాడని, అతడికి ప్రభుత్వం నుండి ఎటు వంటి సహాయం అందలేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇన్సూరెన్స్ ఉంటే వారికి ఉపయోగ పడుతుందని, అందువల్ల మున్సిపాలిటీయే వారికి నేరుగా బీమా చేయించాలన్నారు.

పిఎఫ్, ఈఎస్ఐ అమలవుతున్నా పెద్ద పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడే ఈఎస్ఐ హాస్పటల్ లో వైద్యం అందుతుందని, చిన్న ప్రమాదాలు జరిగినప్పుడు ఈఎన్ఐ కు బిల్స్ రియింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటే రావడం లేదన్నారు. కనుక ఈ విషయంపై స్పందించి కార్మికులకు మున్సిపాలిటీ నుండే ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా పని ప్రదేశాలలో కార్మికులు ఇబ్బంది పడకుండా చలివేంద్రాలు, మజ్జిగ ప్యాకెట్లను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ( ఏఐటీయూసీ) జిల్లా ఉపాధ్యక్షులు అనుముల నరేందర్ రెడ్డి, విజయ్, కృష్ణ పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com